ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
గురువారం 8 ఫిబ్రవరి 2024







ప్చ్..నిరాశే

బాపట్ల జిల్లాకు దక్కని ప్రాధాన్యం

బాపట్ల జిల్లాగా ఆవిర్భవించి వచ్చే ఏప్రిల్‌కు రెండేళ్లు పూర్తి అవుతుంది. పలు కార్యాలయాల్లో మౌలిక వసతుల కొరత వెంటాడుతూనే ఉంది. జిల్లా అయితే ఈ ప్రాంతం పారిశ్రామికంగా కొత్త పుంతలు తొక్కుతుందని ఆశలు పెట్టుకున్న నిరుద్యోగుల ఆశ రెండేళ్లుగా నెరవేరలేదు. జిల్లా ఆవిర్భవించాక గతేడాది ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లో ప్రాధాన్యం దక్కుతుందని ఆశపడిని ప్రజలకు నిరాశే మిగలగా, బుధవారం ప్రవేశపెట్టిన మలి బడ్జెట్ సైతం జిల్లావాసులకు నిరాశనే మిగిల్చింది. బడ్జెట్ కేటాయింపుల్లో జిల్లాకు ఇతోధికంగా నిధులు రాబట్టడంలో పాలకపార్టీ నేతల కృషి నామమాత్రంగా కూడా లేకపోవడంతో వారు ఇచ్చిందే దక్కుదల, వచ్చిందే ప్రాప్తం అన్నట్లుగా ప్రజల పరిస్థితి తయారైంది. సమీకృత కలెక్టరేట్ ప్రతిపాదనలను తొలినాళ్లలో రూపొందించారు. గతేడాది బడ్జెట్‌లో అందుకు సంబంధించి నిధులేవీ కేటాయించకపోవడంతో వాటిని అటకెక్కించారు. ప్రస్తుత బడ్జెట్‌లో అయినా వాటి ఊసు ఉంటుందనుకుంటే అదేమీ కనడడలేదు. జిల్లా పారిశ్రామికంగా ఎదగ డానికి అవకాశం ఉన్న రంగం ఆక్వాపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపు తోంది. పర్చూరు ప్రాంతంలో ఎక్కువగా మిర్చి, డెల్టా ప్రాంతంలో వరి రైతులను ఆదుకోవడానికి ప్రత్యేక కేటాయింపులేవి బడ్జెట్ పద్దులో కనబడలేదు. గుంటూరు ఛానల్ విస్తరణకు రైతు సంఘాలు ఏళ్ల తరబడి పోరాటం చేస్తూనే ఉన్నా కేటాయింపులో దాని ఊసే కరువైంది. జిల్లాలో కొరిశపాడు ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయిస్తున్నట్లు గత బడ్జెట్‌లో పొందు పరిచారు. అయితే ఇంతవరకు పైసా విదిల్చిన పాపాన పోలేదు. ఈ ఏడాది పద్దులోనూ ఆ పథకానికి నిరాశే ఎదు రైంది. దాదాపు 5,000 ఎకరాలకు నీరందించే భవనాసి రిజర్వాయర్ పనులకు సంబంధించి కూడా బడ్జెట్‌లో చోటు దక్కలేదు. కాల్వల్లో తూటుకాడ, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో నీరు వదిలినప్పటికీ చివరి ఆయకట్టుకు నీరు చేరడం గగనమైపోయినా పాలకులు పట్టించుకోలేదని బడ్జెట్‌తో అర్థమవుతుంది. గతంలో కలెక్టర్ విజయకృష్ణన్ పర్యాటకరంగం అభివృద్ధికి బాపట్లలో మంచి స్కోప్ ఉందని గుర్తించి 4 కోట్లతో ప్రతి పాదనలు పంపారు. ఆ కొద్ది మొత్తం విడుదలకు కూడా ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడంతో ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి. కనీసం ఈ బడ్జెట్‌లో అయినా ఎంతోకొంత వాటా దక్కుతుందను కుంటే ఇక్కడా నిరాశే ఎదురైంది.


● పునాదుల్లోనే నిలిచిపోయిన బాపట్ల మెడికల్ కళాశాల


● అద్దంకి: చిల్లచెట్లతో మధ్యలో శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం

ఎన్నికలకు ముందు బడ్జెట్.. నిధులు వరద.. ప్రత్యేక ప్రాజెక్టుల ప్రకటన.. పాత పనులకు ప్రత్యేక కేటాయింపులు.. అని ఆశించిన వారికి బుగ్గన బడ్జెట్ తీవ్ర నిరాశను మిగిల్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రస్తావన లేకుండానే బడ్జెట్ ప్రవేశ పెట్టారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి ఏ ఒక్క ప్రాజెక్టు కు ఎలాంటి కేటాయింపులు జరపలేదు. గంటకు పైగా సాగిన ఆయన సుదీర్ఘ ప్రసంగంలో ఒకే ఒక్క చోట నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని మాత్రం ప్రస్తావించారు. అంతకు మించి ఎక్కడా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పేరు ప్రస్తావనకు రాలేదు.

- బుగ్గన బడ్జెట్‌లో మొండిచెయి
- ఉమ్మడి గుంటూరు జిల్లాకు నిధులు నై
- బడ్జెట్ కేటాయింపుల్లో దక్కని ప్రాధాన్యం
- కీలక రంగాలకు నిధుల ఊసే లేకుండా బడ్జెట్
- పల్నాడు, బాపట్ల జిల్లాలపై రెండో ఏడూ శీతకన్నే


గుంటూరు ఛానల్

బాపట్ల, గుంటూరు, నరసరావుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి): గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణ, పల్నాడు కరువు దుర్భిక్ష నివారణ పథకం, నల్లమడ డ్రెయిన్ మోడర్ నైజేషన్, బుగ్గవాగు రిజర్వాయర్, కృష్ణా పశ్చిమ డెల్టా, సాగర్ కుడికాలువ ప్రాజెక్టుల పనులకు సంబంధించి నిధుల కేటా యింపు జరపలేదు. బుగ్గన బడ్జెట్‌తో జిల్లా ప్రజానీకానికి ఒరి గేది ఏమి లేదని స్పష్టమైంది. ప్రధానంగా భారీ నీటిపారుదల శాఖకు సంబంధించి కీలకమైన ప్రాజెక్టులు ఉన్నాయి. గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణకు సంబంధించి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే టెండర్లు జరిగాయి. ఈ ఐదేళ్లలో భూసేకరణ ప్రక్రియ నోటిఫికేషన్ల వరకు మాత్రమే వైసీపీ తీసుకొచ్చిందంటే నీటిపారుదల రంగంపై ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో తేటతెల్లం అవుతున్నది. పల్నాడు కరువు దుర్భిక్ష నివారణ పథకం పనులను వైసీపీ ప్రభుత్వం వస్తూనే నిలిపేసింది. వైసీపీ ప్రభుత్వం డాక్టర్ వైఎస్ఆర్ పల్నాడు కరువు దుర్భిక్ష నివారణ పథకం అంటూ పేరు మార్చి రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిధులు కేటాయిస్తున్నట్లు బిల్డప్ ఇచ్చింది. తీరా చేతులెత్తేయడంతో నిర్మాణ సంస్థలు కూడా వెనకడుగు వేసి యంత్రపరికరా లన్నింటిని వేరే ప్రాంతానికి తరలించాయి. నాగార్జున సాగర్, కృష్ణా పశ్చిమ డెల్టా కాలు వలపై ఈ ఐదేళ్ల లో నామమాత్రంగానే పనులు జరిగాయి. టీడీపీ హయాంలో అమరావతి నూతన రాజధాని నిర్మాణానికి ఏటా బడ్జెట్‌లో కేటాయింపులు జరిపేది. వైసీపీ ప్రభుత్వం అమరావతి అనే పదాన్ని తొలగించి నూతన రాజధాని అని పెట్టి కేటాయింపులు జరిపినా ఇక్కడ ఎలాంటి నిధులు ఖర్చు పెట్టలేదు. బాపట్ల, గురజాల నియోజకవర్గాల్లో నిర్మాణం జరుగుతున్న మెడికల్ కాలేజీల పనులు ముందుకు సాగాలంటే ఈ బడ్జెట్‌లో భారీగా నిధుల కేటాయింపు జరగాల్సి ఉన్నది. అమరావతి - అనంతపురం గ్రీన్ పీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే ప్రాజెక్టుని కూడా బుట్ట దాఖలు చేసింది.



పిడుగురాళ్ల: బ్రాహ్మణపల్లి సమీపంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల


నిజాంపట్నం హార్బర్


గోదావరి జలాల తరలింపు పథకంకు నకరికల్లు వద్ద నాటి సీఎం చంద్రబాబు నాయుడు అవిష్కరించిన శంకుస్థాపన శిలాఫలకం

చిత్తశుద్ధి కరువు

పల్నాడు జిల్లాలోని నీటి పథకాలపై ప్రభుత్వం మొండిచెయి చూపింది. నీటి పథకాలను పూర్తి చేయడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బుగ్గన బడ్జెట్ తెలియజేసింది. పల్నాడు జిల్లాగా ఆవిర్భవించి వచ్చే ఏప్రిల్‌కు రెండేళ్లు పూర్తి అవుతుండగా ఈ బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు లేవు. దీంతో తొలి బడ్జెట్‌లాగే ఈ ఏడూ జిల్లా వాసులకు నిరాశనే మిగిల్చింది. తాగు, సాగునీటి పథకాలకు నిధుల కేటాయింపులు లేదు. వాటర్ గ్రిడ్‌పై, దశాబ్దాల కలైన వరికపూడిశెలకు బడ్జెట్‌లో నిధులు లేవు. పల్నాడు కరువు పథకం పనుల ఊసే ఎత్త లేదు. బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం గురించి ఆలోచించలేదు. గోదావరి పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా వైఎస్ఆర్ పల్నాడు కరువు నివారణ పథకంగా పేరు మార్చిన ప్ర భుత్వం నిధుల విడుదలను విస్మరించింది. వరికపూడిశెల ప్రాజెక్టు విష యంలోనూ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా ఉన్నదని ఈ బడ్జెట్ ద్వారా అర్థమవుతుందని రైతులు మండిపడుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో హడావుడిగా సీఎం శంకుస్థాపన చేసి నిధులు విడుదల చేయకుండా చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ అనుమతులు రాకుండానే శంకుస్థాపన చేయడం ప్రజలను మోసం చేయడమేనని చెప్పవచ్చు. దాదాపు 21,473 ఎకరాలను సాగు నీరు అందించే తంగెడ, మాచవరం ఎత్తిపోతల పథకాలు సర్వే దశలో ఉన్నా బడ్జెట్‌లో నిధుల కేటాయింపును విస్మరించింది. ఇప్పట్లో ఈ పథకాల పనులు పట్టాలెక్కే పరిస్థితులు కానరావడంలేదు. జిల్లాలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించే లక్ష్యంతో ప్రకటించిన వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణాన్ని కూడా ప్రభుత్వం విస్మరించిందన్న విమర్శలున్నాయి. రూ.1200 వ్యయం అవుతుందని అంచనా వేసి, 611 గ్రామాలకు నీరు అందించే ఈ బృహత్తర పథకం నిర్మాణంపై ప్రభుత్వం శీతకన్ను వేసింది. నిధులు లేకపోవడంతో రెండేళ్లుగా ఈ పథకం పను లు ప్రారంభం కాలేదు. ఈ బడ్జెట్‌లోనూ నిధులను విస్మరిం చడంతో ఈ పనులు ఇప్పట్లో ప్రారంభమయ్యే పరిస్థితులు లేవని చెప్పవచ్చు. తాగు, సాగునీటి అవసరాల కోసం సాగర్ కుడి కాల్వ పరిధిలోని బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపునకు నిధుల విడుదల విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తుందన్న విమర్శలున్నాయి. బుగ్గవాగు సామర్థ్యం పెంచితే గురజాల, మాచర్ల నియోజకవర్గాల ప్రజలకు వేసవిలో తాగునీటి కష్టాలు తప్పే అవకాశం ఉన్నా ప్రభుత్వంలో చలనంలేదు. జల్‌జీవన్ మిషన్, వాటర్ గ్రిడ్ పథకాలు బుగ్గవాగు సామర్థ్యం పెంపుపై అధారపడి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై జిల్లావాసులు తీవ్ర అసం తృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన సాగు, తాగునీటి పథకాలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవ డిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. .


ఎత్తిపోతల

ఓదారుస్తూ.. భరోసా

నిజం గెలవాలి యాత్రలో భువనేశ్వరి

- బాధిత కుటుంబాలకు పరామర్శ, ఆర్థిక సాయం
- టీడీపీ, జనసేన శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని ఘనస్వాగతం


వట్టిచెరుకూరు : అనంతవర్పాడు ఎస్సీ కాలనీలో కోటేశ్వరరావు భార్యకు చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి

వట్టిచెరుకూరు, నరసరావుపేట రూరల్, రొంపిచర్ల, యడ్లపాడు, ఫిబ్రవరి 7: ఓదారుస్తూ.. పరామర్శిస్తూ.. యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ.. ధైర్యంగా ఉండాలి.. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇస్తూ.. టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నిజం గెలవాలి యాత్ర చేపట్టారు. బుధవారం పల్నాడు, గుంటూరు జిల్లాలో ఆమె పర్యటించారు. చంద్రబాబు అరెస్టుతో కలత చెంది గతంలో మృతి చెందిన కుటుంబాలను ఈ పర్యటనలో భువనేశ్వరి ప్రత్యేకంగా పరామర్శించారు. ఆయా కుటుంబాల వారికి ధైర్యం చెప్పి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులో నార్నె విజయలక్ష్మి, అనంతవరప్పాడు ఎస్సీకాలనీలో కోటేశ్వరరావు, యడ్లపాడు ఎస్టీకాలనీలో మరణించిన మొగిలి సత్యనారాయణ కుటుంబాల్ని పరామర్శించారు. అనంతరం నరసరావుపేట మండలం ములకలూరులోని షేక్ సైదా, పాలపాడులోని కొలికొండ అంజనేయులు, రొంపిచర్ల మండలం అన్నవరంలో ఉదయ్‌శేఖర్, చిన్న భిక్షాలు కుటుంబాలను ఆమె పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చెక్కులు అందజేశారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబసభ్యులను ఓదార్చారు.


నరసరావుపేట: పాలపాడులో చెక్కును అందజేస్తున్న భువనేశ్వరి

పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వాగతం

భువనేశ్వరి పర్యటనలో టీడీపీ, జనసేన శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు హారతు లు పట్టి ఆమెకు స్వాగతం పలికారు. యడ్లపాడు, చిలకలూరిపేట, కావూరు, అవిశాయపాలెం, ములకలూరు, నరసరావుపేటలోని పల్నాడు రోడ్డు, కాకతీయనగర్, రావిపాడు, పాలపాడులలో మహిళలు, టీడీపీ శ్రేణులు భువనేశ్వరికి స్వాగతం పలికారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి ప్రత్తి పాటి పుల్లారావు, ప్రత్తిపాటి వెంకటకుమారి, నరసరావుపేటలో నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, టీడీపీ కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్ నేతృత్వంలో భువనేశ్వరికి స్వాగతం పలికారు. కార్యక్ర మంలో ఎమ్మెల్సీ అనురాధ, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, డాక్టర్ కడియాల లలిత్ సాగర్, దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ములకలూరులో చెక్కును అందజేసి కుటుంబ సభ్యులతో భువనేశ్వరి

● వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు, వింజనంపాడు గ్రామాల్లో భువనేశ్వరికి అడుగడుగున మహిళలు టీడీపీ, జనసేన శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్ర హాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ప్రత్తిపాడు సమన్వ య కర్త రామాంజనేయులు, మాజీ మంత్రి డాక్టర్ మాకినేని పెదరత్తయ్య, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, మాజీ జడ్పీటీసీ అన్నాబత్తుని జయలక్ష్మి, ఉగ్గిరాల సీతారామయ్య, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, అనంతవరప్పాడు గ్రామ అధ్యక్షుడు మోపర్తి శంకర్, సర్పంచ్ దారా వెంకట్రావు, జనసేన మండల అధ్యక్షులు పత్తి భావన్నారాయణ, కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు నాగిశెట్టి నాగరాజు, జనసేన సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, ప్రవీణ్, మాజీ సర్పంచ్ ముప్పా మురళీకృష్ణ, మాజీ అధ్యక్షుడు యర్రగుంట్ల నరేంద్రబాబు, వింజనంపాడు సర్పంచ్ నార్నె రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ ఉప్పుటూరి సుజాత, మాజీ సర్పంచ్ చింపిరయ్య, మాజీ ఎంపీటీసీ నార్నె సాంబశివరావు, పరిటాల హరిబాబు పాల్గొన్నారు.

నేతలకు ఇసుకపైనే ప్రేమ

- కట్టలను కూల్చేసి అక్రమార్జన
- వైఎస్ చేసిన అభివృద్ధి తప్ప ఇంకేమీ లేదు
- రాజశేఖరరెడ్డి విగ్రహం పెట్టడాన్ని అడ్డుకున్న నేత
- బాపట్ల బహిరంగ సభలో పీసీసీ సారథి షర్మిల


మాట్లాడుతున్న షర్మిల

బాపట్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): 'నేను దారిలో వస్తుండగా ఓ అన్నను బాపట్ల ఎలా ఉందని అడిగా.. మీ నాన్న ఉన్నప్పుడు 1400 కోట్లతో చేసిన పనులు తప్ప మరేమీ లేదన్నారు. కనీసం రోడ్లు కూడా వేయలేదన్నాడు. ఇక్కడున్న ఎమ్మెల్యే, ఎంపీలకు ఇసుక మాఫియా మీద ప్రేమ తప్ప మరేం లేదు. కట్టలు కట్టడం కాదు కదా వాటిని కూడా కూల్చేసి ఆ ఇసుకను కూడా అక్రమార్జనకు వాడుకుంటున్నారు. రాజశేఖరరెడ్డి విగ్రహం కూడా పెట్టకుండా ఇక్కడున్న వైసీపీ నాయకులు అడ్డుకుంటున్నారు. వీళ్లా ఆయన ఆశయాలను నెరవేర్చేది..' అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిలరెడ్డి అన్నారు. బుధవారం బాపట్లలోని అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. డెల్టా ఆధునికీకరణ పనులు పూర్తయితే రెండు పంటలకు నీళ్లు అందుతాయని తెలిసీ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రాజశేఖ రరెడ్డి వ్యవసాయాన్ని పండగ చేస్తే పంట నష్ట పరిహారం కూడా ఇవ్వని ప్రభుత్వం జగన్‌దని షర్మిల అన్నారు. ఈ ఐదేళ్లలో ఒక్క రోడ్డు కూడా వేయలేదని, కనీసం బాపట్ల తాగునీటి సమస్యను కూడా పట్టించుకో లేదన్నారు. ఒక్క సీటు కూడా గెలవని బీజేపీకి రాష్టంలోని రెండు పార్టీలు గులాంగిరి చేస్తున్నాయన్నారు. దళిత క్రైస్తవులకు దళితుల హోదా దక్కాలంటే పీసీసీ సారథి షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం అన్నారు. గతంలో రామానాయుడు మీద పోటీ చేసి కొద్ది తేడాతో ఓడిపోయానని కాంగ్రెస్ మళ్లీ ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. రాజశేఖరరెడ్డి దిష్టిబొమ్మలు తగలబెట్టిన వ్యక్తిని వైసీపీలోకి తీసుకుని పదవులు కట్టబెట్టారని స్థానిక ఎమ్మెల్యేని ఉద్దేశించి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు తెలిపారు.

రోడ్ షో విజయవంతం..

బాపట్ల చీలురోడ్డు నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు జరిగిన షర్మిల రోడ్‌షోలో కాంగ్రెస్ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నాయి. రోడ్డు పొడ వునా ఉన్న జనానికి అభివాదం చేస్తూ షర్మిల ముందుకు కదిలారు. బహి రంగ సభ అనంతరం ఆమె రాత్రి బస కోసం బాపట్ల ఇంజనీరింగ్ కళాశా లకు వెళ్లారు. బుధవారం రాత్రికి అక్కడే బస చేయనున్న ఆమె గురువారం తెనాలి మండలంలో జరిగే రచ్చబండ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో నేతలు కెవీపీ రామచంద్రరావు, రఘువీరారెడ్డి, కనుమూరి బాపిరాజు, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు


సభకు హాజరైన కార్యకర్తలు, ప్రజలు

జై శ్రీరామ్

● గుంటూరు నుంచి అయోధ్యకు రైలు ప్రారంభం

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని భవ్యమైన రామ మందిరం- దివ్యమైన బాలరాముని దర్శనార్థం రామ భక్తులతో కూడిన అయోధ్య ప్రత్యేక రైలు గుంటూరు నుంచి బయలుదేరింది. ఈ సందర్భంగా గుంటూరు రైల్వేస్టేషన్ ప్రాంగణం జై శ్రీరామ్ నినాదాలతో మారుమోగింది. రామ భక్తులతో స్టేషన్ కిక్కిరిపోసింది. శ్రీరామభక్తులకు నుదుటిన తిలకం అద్ది బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జాతీయ కార్యదర్శి వై సత్యకుమార్ పలు బోగీలలోకి వెళ్లి ప్రయాణికులతో మాట్లాడారు. క్షేమంగా అయోధ్యదాం పర్యటన ముగించుకుని రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ప్రత్యేక రైలు లోకోకి పూజలు చేసి వారు పోశారు. ఆ తర్వాత పురందేశ్వరి పచ్చ జెండా ఊపి రైలుకు సిగ్నల్ ఇచ్చారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ ఏపీ నుంచి అయోధ్యకు వెళుతున్న మొదటి రైలన్నారు. భక్తులు తండోపతండాలుగా బాలరాముని దర్శనం కోసం వెళుతుంటే చూడాలని మాత్రమే తాను వచ్చానన్నారు. కార్యక్రమంలో తాళ్లాయపాలెం శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు చందు సాంబశివరావు పాల్గొన్నారు.


రైలుకి జెండా ఊపి ప్రారంభిస్తున్న పురంధేశ్వరి

యువకుడి హత్య కేసులో వీడని మిస్టరీ
● పోలీసులపై పరస్పర ఆరోపణలు
7లో..

దిక్సూచి
DIKSUCHI

హైదరాబాద్‌లోని 'నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా'కి చెందిన మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం- ఇంటిగ్రేటెడ్ బీబీఏ-ఎంబీఏ, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశానికి విడివిడిగా నోటిఫికేషన్లు విడుదల చేసింది.

- వెబ్‌సైట్: doms.nalsar.ac.in



నల్సార్‌లో మేనేజ్‌మెంట్ కోర్సులు

బీబీఏ-ఎంబీఏ ప్రోగ్రామ్(ఐపీఎం)

ఇది ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్. యూజీసీ నిబంధనల మేరకు చాయిస్ బేస్డ్ క్రెడిట్ పాలసీతో ప్రోగ్రామ్‌ను రూపొందించారు. ఇందులో మొత్తం 15 టర్మ్‌లు ఉంటాయి. రెండో ఏడాది తరవాత అభ్యర్థులు స్టార్టప్ కంపెనీల్లో ఆరు నుంచి ఎనిమిది వారాలు ఇంటర్న్‌షిప్; మూడు, నాలుగు సంవత్సరాల కోర్సు పూర్తయ్యాక స్పెషలైజేషన్‌కు సంబంధించిన ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది.

ఎంబీఏ లెవెల్ స్పెషలైజేషన్‌లు: బిజినెస్ రెగ్యులేషన్స్, కార్పొరేట్ గవర్నెన్స్, కోర్టు మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్సెస్, ఇన్నోవేషన్ అండ్ సస్టెయినబిలిటీ, మార్కెటింగ్, ఆపరేషన్స్ అండ్ సిస్టమ్స్.

సీట్లు: మొత్తం 66 సీట్లున్నాయి.

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్మీడియట్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. ఇంటర్ స్థాయి చివరి సంవత్సర పరీక్షలు రాస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్‌మెట్(యూజీ)/ఇండోర్ ఐఐఎం నిర్వహించే ఐపీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 31

ఎంబీఏ

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు.

స్పెషలైజేషన్‌లు: కార్పొరేట్ గవర్నెన్స్, ఇన్నోవేషన్ అండ్ సస్టయినబిలిటీ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ క్యాపిటల్ మార్కెట్స్, ఆపరేషన్స్ అండ్ సిస్టమ్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, బిజినెస్ రెగ్యులేషన్స్, కోర్ట్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్. **సీట్లు:** మొత్తం 66 సీట్లు ఉన్నాయి.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. నల్సార్ మేనేజ్‌మెంట్ ఎంట్రెన్స్ టెస్ట్(ఎన్‌మెట్ పీజీ)2024/క్యాట్ 2023 అర్హత పొంది ఉండాలి. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 18

ఎఫ్ఆర్ఐలో ఎమ్మెస్సీ

డెహ్రాడూన్‌లోని ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్ఆర్ఐ)- ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఫారెస్ట్రీ, ఉడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్, సెల్యూలోజ్ అండ్ పేపర్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్ రిమోట్ ప్రొక్టోర్డ్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

అడ్మిషన్ టెస్ట్ వివరాలు: పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. బేసిక్ సైన్సెస్, సోషల్ సైన్సెస్, అర్థమెటిక్ అండ్ క్వాంటిటేటివ్ ఎబిలిటీస్, కంప్యూటేషనల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, ఇంట్రప్రిటేషన్ ఆఫ్ టేబుల్స్, గ్రాఫ్స్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, కాంప్రహెన్షన్, ఒకాబులరీ, గ్రామర్, ఇడియమ్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు వంతు మార్కు కోత విధిస్తారు. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 15 శాతం మార్కులు రావాలి.



ముఖ్య సమాచారం

- ★ డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45శాతంచాలు.
- ★ **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- ★ **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఏప్రిల్ 8
- ★ **ఆన్‌లైన్ రిమోట్ ప్రొక్టోర్డ్ అడ్మిషన్ టెస్ట్ తేదీ:** మే 19
- ★ **చిరునామా:** రిజిస్ట్రార్, ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్ఆర్ఐ), పీఓ ఐపీఈ కౌలాగర్ రోడ్, డెహ్రాడూన్-248195
- ★ **వెబ్‌సైట్:** www.fridu.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/Fe0ahm9లో చదవండి.

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ)- బీటెక్+ఎంటెక్ డ్యూయెల్ డిగ్రీ సెల్ఫ్ సపోర్ట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిని డా.వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో నిర్వహిస్తున్నారు. మొత్తం 510 సీట్లు ఉన్నాయి. ఏఎన్‌యూ నిర్వహించే ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏఎన్‌యూఈఈటీ) 2024 ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. నాలుగేళ్ల కోర్సు పూర్తిచేసిన తరవాత బీటెక్ డిగ్రీతో ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది.

నాగార్జున వర్సిటీలో డ్యూయెల్ డిగ్రీ


విభాగాలు-సీట్లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 120, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ 120, మెకానికల్ ఇంజనీరింగ్ 30, సివిల్ ఇంజనీరింగ్ 30, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 30, డేటా సైన్స్ 60, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ 60, సైబర్ సెక్యూరిటీ 60 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 10
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 1 నుంచి
- **ఏఎన్‌యూఈఈటీ 2024 తేదీ:** ఏప్రిల్ 7
- **ఫలితాలు విడుదల:** ఏప్రిల్ 10
- **వెబ్‌సైట్:** www.anucet.in



విధ్వంసాల జాతర



రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. కావ్యాథాపర్, అనుపమా పరమేశ్వరన్ కథానాయికలు. ఈనెల 9న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ట్రైలర్ ఆద్యంతం రవితేజ్ యాక్షన్ హంగామా కనిపించింది. సరికొత్త మేకోవర్‌లో ఆయన కనిపించారు. 'వచ్చాడంటే మోతరా, విధ్వంసాల జాతర' అంటూ ఆయన పలికిన డైలాగ్‌లు మాస్ ప్రేక్షకులను ఉర్రూతలూగించేలా ఉన్నాయి. ఈ చిత్రంలో నవదీప్, అవసరాల శ్రీనివాస్, మధుబాల, అజయ్‌ఘోష్, శ్రీనివాస్‌రెడ్డి కీలకపాత్రలు పోషించారు. సంగీతం: డేవ్ జాండ్

మానవత్వాన్ని పంచే మొయినుద్దీన్ భాయ్



'మతాన్ని నమ్మితే మనసులో ఉంచుకో...మానవత్వాన్ని అందరితో పంచుకో' అంటున్నారు రజనీకాంత్. 'లాల్ సలామ్' చిత్రంలో మొయినుద్దీన్ భాయ్ పాత్రలో రజనీకాంత్ పలికిన డైలాగ్ ఇది. ఈ నెల 9న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. గ్రామీణ వాతావరణం, రాజకీయాలు, మతవిద్వేషాల నేపథ్యంలో సాగే కథ అని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. రజనీకాంత్ చాలా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. ఈ చిత్రానికి ఐశ్వర్య దర్శకత్వం వహించారు. విష్ణు విశాల్, విక్రాంత్, జీవితా రాజశేఖర్, క్రికెటర్ కపిల్ దేవ్ కీలకపాత్రలు పోషించారు. సుభాస్కరన్ నిర్మించారు.

ఫ్యామిలీస్టార్ ప్రేమగీతం



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఫ్యామిలీస్టార్'. ఆయనకు జోడీగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బేనర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం చిత్రబృందం 'నందనందనా' అంటూ సాగే ప్రేమగీతాన్ని విడుదల చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ మొదలుపెట్టింది. ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, గోపీ సుందర్ స్వరాలు సమకూర్చారు. సిద్ శ్రీరామ్ ఆలపించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కేయూ మోహనన్. ఎడిటర్: మార్తాండ్ కే వెంకటేశ్

మార్చిలో గామి ఆగమనం



విష్వక్‌సేన్ కథానాయకుడిగా రూపొందుతున్న అడ్వెంచర్ డ్రామా 'గామి'. విద్యాధర్ కాగిత దర్శకత్వంలో కార్తీక్ శబరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. 'గామి' చిత్రాన్ని మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విష్వక్‌సేన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విద్యాధర్ 'గామి' సినిమా కోసం చాలా పరిశోధన చేశాడు. సినిమా పూర్తి చేయడానికి దాదాపు నాలుగున్నరేళ్లు పట్టింది. వారాణసిలో షూటింగ్ చేస్తున్నప్పుడు చాలామంది నన్ను చూసి నిజమైన అఘోరా అనుకున్నారు. నాకు ధర్మం చేశారు. ఓ ముసలామె ఆప్యాయంగా భోజనం పెట్టారు. ఈ సినిమా కోసం చాలా కష్టాలు పడ్డాం. ట్రైలర్ మైండ్‌బ్లోయింగ్‌గా ఉంది. సినిమా అందరినీ అలరిస్తుంది' అన్నారు. విద్యాధర్ మాట్లాడుతూ 'అఘోర శంకర్ హిమాలయాల్లో చేసే సాహసోపేత ప్రయాణమే 'గామి' కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వడానికి ప్రయత్నించాం. విష్వక్ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. ఏదడిగితే అది చేశారు. గడ్డకట్టించే చలిలో సైతం నటించాడు. ఈ సినిమా కోసం కుంభమేళాని చిత్రీకరించాం' అని చెప్పారు. కార్తీక్ శబరీష్ మాట్లాడుతూ '2018లో ఈ సినిమాను మొదలుపెట్టాం. చాలా ఎగ్జయిటింగ్ కంటెంట్ ఉన్న సినిమా ఇదని తెలిపారు. ఈ చిత్రంలో చాందిని చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. ఎంజి అభినయ, హారిక, మహ్మద్ సమద్ ముఖ్య తారాగణం. సంగీతం: నరేశ్ కుమారన్.


రెండింతల వినోదం



సిద్దు జొన్నలగడ్డకు స్టార్ స్టేటస్‌ను తెచ్చిన చిత్రం 'డీజే టిల్లు'. 'అట్లుంటది మనతోని' అంటూ ఆ సినిమాలో ఆయన పంచిన వినోదం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు మరోసారి టిల్లూ బాయ్ ప్రేక్షకులను ఎంటర్టైన్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. 'డీజే టిల్లు'కు సీక్వెల్‌గా 'టిల్లూ స్క్వేర్' రూపొందుతోంది. మల్లిక్‌రామ్ దర్శకత్వంలో సితార ఎంటర్టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. మార్చి 29న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం సిద్దు పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం బర్త్‌డే గ్లింప్స్‌ను విడుదల చేసింది. కారులో హీరో హీరోయిన్ల రొమాన్స్, రాధికతో ప్రణయం గురించి టిల్లూ గుర్తు చేసుకొనే సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. సిద్ధు తనదైన స్టైల్లో మరోసారి డైలాగ్‌లతో మ్యాజిక్ చేశాడు. ఈ సినిమా ట్రైలర్‌ను ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. రామ్ మిరియాల, అచ్చు రాజమణి సంగీతం అందిస్తున్నారు. ఎస్ఎస్ థమన్ నేపథ్య సంగీతం సమకూరుస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సాయిప్రకాశ్ ఉమ్మడి సింగు. ఎడిటర్: నవీన్ నూలి

ఆర్ఆర్ఆర్ ఓ అద్భుతం

రాజమౌళిపై కామెరూన్ ప్రశంసలు

హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు జేమ్స్ కామెరూన్ మరోమారు రాజమౌళిని అభినందనలతో ముంచెత్తారు. 'ఆర్ఆర్ఆర్' సినిమా ఓ అద్భుతం అని ప్రశంసించారు. సాటర్న్ అవార్డ్స్ కార్యక్రమం ఇందుకు వేదికైంది. ఓ రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు కామెరూన్ బదులిస్తూ "ఆర్ఆర్ఆర్' చాలా అద్భుతమైన సినిమా అనిపించింది. ఆ అనుభూతినే రాజమౌళితో పంచుకున్నాను. ప్రపంచం మొత్తం ఆ సినిమాను ఇష్టపడింది. భారతీయ సినిమా ప్రపంచవ్యాప్తంగా సత్తా చాటడం మంచి పరిణామమని' పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై స్పందించిన 'ఆర్ఆర్ఆర్' చిత్రబృందం కామెరూన్‌కు ధన్యవాదాలు తెలిపింది. గతేడాది జరిగిన క్రిటిక్స్ ఛాయిస్ అవార్డుల కార్యక్రమంలో రాజమౌళి, కామెరూన్ కలిశారు. ఆ సందర్భంలో కామెరూన్ 'ఆర్ఆర్ఆర్' అద్భుతంగా ఉందని కొనియాడారు. ప్రస్తుతం మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి ఓ చిత్రం రూపొందిస్తున్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/YowEbvo లో చదవండి.

నన్నే హీరోయిన్‌గా అనుకున్నారు



సందీప్ కిషన్, వర్ష బొల్లమ్మ జంటగా నటించిన ఫాంటసీ అడ్వెంచర్ 'ఊరుపేరు భైరవకోన'. వీఐ ఆనంద్ దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మించారు. ఈ నెల 16న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా వర్ష బొల్లమ్మ మీడియాతో మాట్లాడారు.

- ఈ కథ రాసుకున్నప్పుడే నన్ను హీరోయిన్‌గా అనుకున్నానని ఆనంద్ చెప్పారు. స్టోరీ చాలా కొత్తగా, అద్భుతంగా అనిపించింది. 'అసలు ఇలాంటి కథను ఎలా ఊహించగలిగారో' అనిపించింది. ఇలాంటి పాత్ర గతంలో ఎప్పుడూ చేయలేదు. అందుకే నిర్ణయం తీసుకోవడానికి కొంత సమయం అడిగాను. ఆనంద్ పాత్ర గురించి వివరంగా చెప్పాక నేను చేయగలననే నమ్మకం ఏర్పడింది.
- పూర్తిస్థాయి వినోదం పంచే చిత్రమిది. ప్రేక్షకులకు మంచి సందేశం, ఉత్కంఠభరితమైన ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. అద్భుతం అనిపించే అతీంద్రియ శక్తుల నేపథ్యం ఉంటుంది. సినిమా నిర్మాణం విషయంలో మేకర్స్ ఎక్కడా రాజీపడలేదు.
- 'స్వాతిముత్యం, మిడిల్ క్లాస్ మెలోడీస్' చిత్రాల్లో పక్కింటి అమ్మాయి తరహా పాత్రలో కనిపించాను. ఈ చిత్రంలో వాటికి భిన్నంగా 'భూమి' అనే గిరిజన యువతి పాత్రలో కనిపిస్తాను. ఊళ్లో తనొక్కతే చదువుకున్న అమ్మాయి. అందంగా, అమాయకంగా కనిపిస్తుంది. కానీ చాలా బలమైన పాత్ర. యాక్షన్ సీన్లు కూడా ఉన్నాయి.

ఏం జరిగింది?



విజయ్ శంకర్, సావిత్రి కృష్ణ జంటగా నటిస్తున్న చిత్రం 'అంతే.. అలా జరిగిపోయింది'. శ్రీరామ్ అమృతపురి దర్శకత్వంలో కంచర్ల సత్యనారాయణరెడ్డి, సముద్రాల మహేశ్‌గౌడ్ నిర్మించారు. బుధవారం టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను నిర్మాత ప్రసన్నకుమార్ చేతుల మీదుగా విడుదల చేశారు. యువతను ఆకట్టుకునే కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం, ఆద్యంతం ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తుందని యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి జయసూర్య బొప్పెం సంగీతాన్ని అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: మురళీమోహన్.



టిప్పర్ ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి

వినుకొండటౌన్, ఫిబ్రవరి 7: ద్విచక్రవాహనాన్ని ప్రమాదవశాత్తు టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని పిట్టంబండ గ్రామసమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఉమ్మడివరం గ్రామ ఎస్సీ కాలనీ చెందిన పిడతల చంద్రశేఖర్ (18) వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తల్లి పున్నమ్మతో కలిసి వినుకొండ వద్ద ఓ శుభకార్యానికి హాజరైన అనంతరం మసీదుమాన్యంలోని తన సోదరి ఇంటి వద్దకు వెళ్లారు. అనంతరం ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా పిట్టంబండ సమీపంలో వెనుకగా వస్తున్న కంకరు టిప్పర్ తగలడంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న పున్నమ్మతో పాటు చంద్రశేఖర్ కిందపడ్డారు. చంద్రశేఖర్‌కు టిప్పర్ టైరు తగలడంతో తీవ్రగాయాలు కాగా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుమందు తాగి విద్యార్థి మృతి

వినుకొండటౌన్, ఫిబ్రవరి 7: పురుగుమందు తాగి విద్యార్థి మృతిచెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శావల్యాపురం మండలం పిచికలపాలెం గ్రామానికి చెందిన అమృతపూడి నాగరాజు వినుకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎంఎల్‌టీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 5వ తేదీన నాగరాజు గడ్డి మందు తాగాడు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



రంగు పడింది..

సత్తెనపల్లి, ఫిబ్రవరి 7: సత్తెనపల్లి పట్టణంలోని ఏరియా వైద్యశాలకు అధికార పార్టీ రంగులు వేయటం చర్చనీయాంశంగా ఉంది. 2018లో స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు హయాంలో ఈ భవనాన్ని నిర్మించారు. దానిపై అదనపు భవన నిర్మాణ పనులు కూడా 90శాతం పూర్తయ్యాయి. ఇప్పుడు భవనానికి రంగులు వేసి ఉండటం చూసి వైద్యశాలకు వచ్చిన రోగులతో పాటు పట్టణ ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



నిండు ప్రాణం.. సమాధి

పైపు లీకులు మరమ్మతులో అపశ్రుతి ● విధులు నిర్వర్తిస్తూ మునిసిపల్ కార్మికుడు మృతి ● తెనాలిలో విషాదం



ఎక్స్‌కవేటర్‌తో వెంకటేశ్వర్లుపై పడిన భారీ మట్టిని తొలగిస్తున్న అధికారులు, మట్టిలో కూరుకుపోయిన వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు (ఫైల్ ఫొటో)

తెనాలి రూరల్, ఫిబ్రవరి 7: మంచినీటి పైపులైను మరమ్మత్తుకు తీసిన గుంత ఓ నిండుప్రాణాన్ని బలిగొంది. వివరాల్లోకి వెళితే.. తెనాలి పట్టణంలోని మునిసిపాలిటీ పరిధిలో బుధవారం మంచినీటి పైపులైను లీకుల మరమ్మత్తులు చేపట్టారు. ఐతానగర్ రజక చెరువురోడ్డులో ప్రధాన రహదారి వెంట జేసీబీ సహాయంతో దాదాపుగా 5 అడుగు గుంత తవ్వగా పైపులైన్ లీకు అవుతూ కనిపించింది. మునిసిపల్ టెంపరరీ పారిశుధ్య కార్మికుడైన ఇమల్ల వెంకటేశ్వర్లు(50) గుంతలో దిగి పైపు చుట్టూ ఉన్న మట్టిని తీసేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇదే క్రమంలో జేసీబీతో తవ్వి గుంత అంచున వేసిన మట్టి ముద్ద జారి పనిచేస్తున్న వెంకటేశ్వర్లుపై పడింది. ఆ మట్టిలో పూర్తిగా కూరుకుపోయిన వెంకటేశ్వర్లు బయటకు వచ్చే అవకాశం లేకపోయింది. తోటి కార్మికులు మట్టి తొలగించి కాపాడే ప్రయత్నం చేయగా.. మట్టి ముద్దగా ఉండటంతో దానిని తీయడం కష్టమైంది. దాదాపుగా 20 నిముషాలు పైనే సమయం పట్టేసరికి వెంకటేశ్వర్లు గుంతలోనే ప్రాణాలు విడిచాడు. 108 సిబ్బంది ఘటనా స్థలానికి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడు చుండూరు మండలం చినపరిమి గ్రామవాసి. అతడికి భార్య ఇద్దరు కుమారులున్నారు. విషయం తెలుసుకున్న భార్య మరియమ్మ, కుమారులు మధుబాబు, సుద్దబాబు, ఇతర కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని విగతజీవుడిగా ఉన్న వెంకటేశ్వర్లును చూసి గుండెలు పగిలేలా రోదించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ శేషన్న ఇతర సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి మృతుని కుటుంబసభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మంచినీటి పైపులైన్లు మరమ్మత్తులు చేసే క్రమంలో మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు దగ్గరుండి పనులు పర్యవేక్షించాల్సి ఉంది. వారెవరూ లేకుండా పనులు పురమాయించి అక్కడి నుంచి వెళ్లిపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పనులు జరిగే సమయంలో ఇంజనీరింగ్ సిబ్బంది అక్కడే ఉన్నారని ఇది అనుకోకుండా జరిగిన ఘటన మాత్రమేనని కమిషనర్ శేషన్న చెప్పారు.

డయేరియా.. ఒకరి మృతి?

- గుంటూరులో తాగునీరు కలుషితం
- పైపులైన్లకు మరమ్మతులు.. తాగునీరు సరఫరా
- వాంతులు, విరేచనాలతో జీజీహెచ్‌కి చేరిన బాధితులు
- ప్రైవేటు, స్థానిక వైద్యుల వద్ద కూడా పలువురి చికిత్సలు

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 7: గుంటూరులో కలుషితమైన తాగునీటికి ఒకరు బలయ్యారు. వాంతులు, విరేచనాలతో పలువురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పైపులైన్లు లీకులతో మురుగునీరు కలిసి గతంలో నగరంలో తాగునీరు కలుషితమైంది. అప్పట్లో ఆ నీటి కారణంగా పలువురు మృతి చెందగా పెద్దసంఖ్యలో ఆస్పత్రులు పాలైన విషయం తెలిసిందే. ఇదే రీతిలో బీఆర్ స్టేడియం నుంచి సంగడిగుంట ప్రాంతంలోని తిరుమలాచారి కాలనీలోకి సరఫరా అవుతున్న తాగునీరు కలుషితమైంది. ఇటీవల బీఆర్ స్టేడియం బయట పైపులైన్లకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల నుంచి ఆ ప్రాంతం వారికి సరఫరా అవుతున్న తాగునీరు కలుషితమైంది. దీంతో సూర్యదేవర ఎస్టేట్ సమీపంలోని తిరుమలాచారి కాలనీకి చెందిన కొర్రపాటి ఓబులు, ఆయన భార్య జయమ్మ, కొడుకు కుమార్, అల్లుడు కృష్ణలు వాంతులు, విరేచనాలతో అవస్వస్థతకు గురై గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో రెండు రోజులుగా చికిత్స పొందుతున్నారు. బుధవారం రాత్రి కొర్రపాటి ఓబులు(50) మృతి చెందాడు. అల్లుడు కృష్ణని మెరుగైన వైద్యం కోసం కాకానిరోడ్డులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పొన్నూరు రోడ్డులోని అహ్మద్‌నగర్‌కు చెందిన జీవా అనే మరో వ్యక్తి వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తిరుమలాచారి కాలనీకి చెందిన మరో పది కుటుంబాల వారు బుధవారం రాత్రి వాంతులు, విరేచనాలకు గురై స్థానికంగా ఉన్న వైద్యుల వద్ద చికిత్స పొందుతున్నారు.



ఓబులు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నసీర్

మున్సిపల్ ఇంజనీర్ల నిర్లక్ష్యం వల్లే..

బీఆర్ స్టేడియంలో పని చేస్తున్న మున్సిపల్ ఇంజనీర్ల నిర్లక్ష్యం వల్లే తిరుమలాచారి కాలనీ, అహ్మద్‌నగర్ తదితర ప్రాంతాల్లో తాగునీరు కలుషితమై డయేరియా తరహాలో అంటువ్యాధులు ప్రబలుతున్నాయని టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి నసీర్ అహ్మద్ తెలిపారు. ఇప్పటికే ఒకరు మృతి చెందారని, కలుషిత నీరు సరఫరా వల్లే ఈ సంఘటన జరిగిందన్నారు. బుధవారం రాత్రి బాధిత కుటుంబాలను పరామర్శించిన ఆయన వారికి కావాల్సిన వైద్య సదుపాయాలను తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు చికిత్స అందించాలన్నారు.

కన్నతల్లే కడతేర్చింది..

● యువకుడి హత్య కేసులో వీడిన మిస్టరీ

గుంటూరు, ఫిబ్రవరి 7: స్థానిక నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీకలవాగు కట్టమీద మంగళవారం రాత్రి దారుణ హత్యకు గురైన షేక్ మహబూబ్ సుభాని హత్య కేసులో మిస్టరీ వీడింది. తొలుత ఈ హత్య ఆటోడ్రైవర్ షేక్ చిన బాజీ చేసినట్లు భావించారు. అయితే పోలీసుల విచారణలో ఈ హత్యలో చినబాజీతో పాటు హతుడి తల్లి జరీనాబేగం హస్తం కూడా ఉన్నట్లు తేలింది. దీంతో గంటల వ్యవధిలోనే ఇరువురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. బుధవారం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, సీఐ డి.నరేష్ మీడియాకు వివరాలు వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, సీఐ నరేష్, వెనుక నిందితులు

పీకలవాగుకట్ట ప్రాంతానికి చెందిన జరీనాబేగం కుమారుడు సుభాని ఆటో మెకానిక్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా జరీనాబేగం ఆటోడ్రైవర్ చినబాజీతో సహజీవనం సాగిస్తోంది. అయితే ఇది సుభానీకి ఇష్టం లేదు. అంతేగాక తాను సంపాదించిన సొమ్మును తల్లి బాజీకి పెడుతుందని భావించి తరచూ బాజీతో గొడవ పడుతుండేవాడు. అయితే తమ సంబంధానికి కొడుకు అడ్డుగా ఉన్నాడని భావించిన తల్లి జరీనాబేగం తన ప్రియుడితో కలసి కన్న కుమారుడి హత్యకు పథకం రూపొందించింది. ముగ్గురూ కలసి మద్యం సేవిస్తుండగా వారి మధ్య గొడవ జరిగింది. దీంతో తల్లి, ప్రియుడు కలసి రోకలిబండతో సుభానీని కొట్టి చంపారు. ఇరువురు నిందితులను అరెస్ట్ చేసిన నగరంపాలెం సీఐ నరేష్, సిబ్బందిని వెస్ట్ డీఎస్పీ అభినందించారు.



ఆనందబాబు సమక్షంలో తెలుగుదేశంలో చేరిన వైసీపీ కార్యకర్తలు

వైసీపీకి ఓటేసి కష్టాలపాలయ్యాం..

● ఆనందబాబు సమక్షంలో టీడీపీలో చేరిన చినపరిమి కార్యకర్తలు

చుండూరు, ఫిబ్రవరి 7: పొరపడ్డాం.. అసమర్థుడికి ఓటు వేసి కష్టాలు తెచ్చుకున్నాం.. ఇక నుంచి మీ వెంటే మా పయనం అంటూ చినపరిమి దళితవాడకు చెందిన వైసీపీ కార్యకర్తలు, నాయకులు బుధవారం తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గుంటూరులోని ఆనందబాబు క్యాంపు కార్యాలయంలో చినపరిమికి చెందిన 20 కుటుంబాలు ఆనందబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ కల్లబొల్లి వాగ్దానాలు చేసి ఆశలు రేపి గెలిచిన జగన్ చివరికి ప్రజలను రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచాడన్నారు. ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించి రాష్ట్రాన్ని ఈ సైకో పాలన గురించి విముక్తి కలిగించడానికి ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని తెలిపారు. ఈ సందర్భంగా చినపరిమి గ్రామంలో గత ప్రభుత్వంలో రూ.5 కోట్లతో జరిగిన అభివృద్ధి పనుల గురించి గ్రామస్తులు ఆనందబాబుకు గుర్తు చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొక్కిలిగడ్డ చిరంజీవి, రేవంత్, కళ్యాణ్, చొప్పర ఇజ్రాయిల్, జాన్ పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట, ఫిబ్రవరి 7: నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవ రాయలు బుధవారం ఢిల్లీలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడును కలిశారు. టీడీపీలో తన చేరికపై చంద్రబాబుతో లావు చర్చించినట్లు తెలిసింది. 11వ తేదీ తర్వాత పార్టీలో చేరే అంశంపై చంద్రబాబుతో చర్చించగా ఇందుకు ఆయన అంగీకరించారని చెబుతున్నారు. ఇప్పటికే నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా శ్రీకృష్ణదేవారాయలు పేరును టీడీపీ అధిష్టానం ఖరారు చేసిన విషయం తెలిసిందే. నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై ఇరువురు మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. మొత్తం మీద చంద్రబాబుతో భేటీతో లావు టీడీపీలో చేరికకు ముహూర్తం ఖరారైనట్లు తెలిసింది. వారంలోగా లావు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. లావు బాటలోనే మాజీ ఎమ్మెల్యే మక్కెనవైసీపీని వీడారు. జంగా వైసీపీకి రాజీనామా చేసే అంశం నేడు పిడుగురాళ్లలో ఆయన నిర్వహిస్తున్న ఆత్మీయ సమావేంలో తేలనుంది. ఇటీవల లావు వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

యువకుడి హత్య కేసులో వీడని మిస్టరీ

● పోలీసులపై పరస్పర ఆరోపణలు

బాపట్ల, ఫిబ్రవరి 7: బాపట్లలో కలకలం రేపిన యువకుడి హత్య కేసులో మిస్టరీ వీడలేదు. హత్యకు గల కారణాలు పోలీసులకు అంతుబట్టలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా మద్యం, గంజాయి మత్తులో సినీఫక్కీలో జరిగిన ఈ ఘటన బాపట్ల పరిసర ప్రాంతాల్లో చర్చనీయాంశంగా మారింది. మంగళవారం చీలురోడ్డుసెంటర్‌లో షేక్ యాసిన్ అనేయువకుడిపై కొంతమంది యువకులు దాడిచేసినట్లు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోనూ అనే యువకుడు మరికొంతమందితో కలిసి వచ్చి తనను మీ అంతా చూస్తామని బెదిరించి దాడిచేశాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే ఈ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించకపోవటంతో యువకుడి హత్యకు దారితీసిందని మృతుడి కుటుంబసభ్యులతోపాటు బాధిత కుటుంబాలవారు ఆరోపిస్తున్నారు. యాసిన్ ఫిర్యాదు చేసిన తర్వాత పోలీసులు సోనూ స్నేహితుడు రాహుల్ బంధువులకు ఫోన్ చేసి ఇలాంటి బెదిరింపులకు పాల్పడితే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించినట్లు సమాచారం. దీంతో రెచ్చిపోయిన సోనూ, రాహుల్‌లు తమ స్నేహితులతో కలిసి యాసిన్‌కు ఫోన్ చేసి మరలా బెదిరించి ఎక్కడ ఉన్నారో కూడా సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే యాసిన్ స్నేహితుడు నిత్యం రద్దీగా ఉండే సూర్యలంకరోడ్డులోని రెస్టారెంట్ వద్ద ఉన్న వారిపై దాడి చేసి గోరంట్ల సుమంత్‌ను హత్య చేసినట్లు తెలుస్తున్నది. ఈ దాడిలో సుమంత్‌తోపాటు, రాహుల్ కూడా తీవ్రంగా గాయపడి చీరాలలో చికిత్స పొంది వెళ్ళిపోయినట్లు తెలిసింది. గతంలో యాసిన్‌కు, సోనూకు మధ్య గొడవలు ఉన్నట్లు సమాచారం. సంచలనం రేపిన ఈ సంఘటనలో పోలీసులు సరిగ్గా స్పందించకపోవటం వల్లే దాడి జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

సాయంత్రం 7గంటలకు ఫిర్యాదు చేశారు : సీఐ

యాసిన్ అనే యువకుడు తనపై కొంతమంది దాడి చేసి బెదిరించారని సాయంత్రం 7గంటలకు ఫిర్యాదు చేసినట్లు పట్టణ సీఐ యు.శ్రీనివాసులు తెలిపారు. దీనికి కారకులైన వారిని పిలిపించి విచారిస్తామని చెప్పగా యాసిన్‌ను తన యాజమాన్యంకు సమాచారం ఇచ్చి వస్తానని బయటకెళ్ళిన అరగంట తర్వాత హత్య జరిగినట్లు సమాచారం వచ్చిందన్నారు. అక్కడకు వెళ్ళి చూడగా సుమంత్‌ను హత్య చేసినట్లు గుర్తించటంతోపాటు అక్కడ రాహుల్‌కు సంబంధించిన రెండు కార్లు ఉండగా అందులో ఒకటి ధ్వంసం చేసి ఉన్నట్లు గుర్తించామన్నారు. కేసును రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. హత్యకు గురైన గోరంట్ల సుమంత్ భౌతికకాయాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. రూరల్ సీఐ జి.హజరత్‌బాబు ఆధ్వర్యంలో పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనకు కారకులైన వారిలో ఇరువురిని విచారిస్తున్నట్లు సమాచారం.

గురజాలలో సర్వేలన్నీ టీడీపీ వైపే

● యరపతినేనితో చెప్పిన చంద్రబాబు



చంద్రబాబుతో యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 7: గురజాల సీటు ఈసారి తప్పకుండా మంచి మెజారిటీతో గెలుస్తాం.. ఎక్కడైనా చిన్న చిన్న సమస్యలుంటే సరిచూసుకో.. శ్రీనివాస్ అని టీడీపీ అధినేత చంద్రబాబు గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికలకు టీడీపీ సమాయత్తమవుతున్న నేపథ్యంలో జిల్లాల వారీగా దాదాపు టిక్కెట్ ఖాయమై పోటీచేసే అభ్యర్థులతో చంద్రబాబు ముఖాముఖిగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. బుధవారం పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత యరపతినేని శ్రీనివాసరావు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతో సమావేశమయ్యారు. దాదాపు 20 నిమిషాలకు పైగా వారిద్దరి మధ్య వివిధ అంశాలపై చర్చ జరిగింది. వివిధ సంస్థలు నిర్వహించిన పలు సర్వేలన్నింటిలోను గురజాలలో టీడీపీ వైపే చూపుతున్నాయని చంద్రబాబు యరపతినేనితో అన్నారు. గురజాలలో సైకిల్ స్పీడ్ పెరిగిందని, రేపటి ఎన్నికల్లో కచ్చితంగా గెలిచే విధంగా అన్ని సర్వేలు సూచిస్తున్నాయి. ఎక్కడైనా చిన్న చిన్న సమస్యలున్నా వాటిని జాగ్రత్తగా చూసుకుంటూ ముందుకెళ్లాలి శ్రీనివాస్.. అంటూ చంద్రబాబు యరపతినేని భుజం తట్టారు. ఉమ్మడి జిల్లా, పల్నాడు జిల్లాలోనూ గురజాలతో పాటు అన్ని నియోజకవర్గాలు కూడా కచ్చితంగా గెలుస్తామని చంద్రబాబు తెలిపారు. గురజాలలో మంచి మెజారిటీతో గెలిచి రావాలని చంద్రబాబు సూచించారు. 1994లో ఎన్‌టీఆర్ మొదటిసారిగా ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వగా అప్పటి నుంచి వరుసగా గురజాల నుంచి పోటీ చేస్తున్నానని, మీరిచ్చిన స్ఫూర్తితోనే గురజాలలో పనిచేస్తున్నానని, ఇప్పుడు కూడా 7వసారి గురజాల నుంచి పోటీ చేసే అవకాశాన్ని కల్పిస్తున్నందుకు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ నాయకుల అక్రమాలకు 8 మంది చిన్నారులు చనిపోయినా, 11 మంది హత్యకు గురైనా ఎక్కడా తొణక్కుండా వారందరికీ నేనున్నాననే ధీమా, నీలో వున్న ధైర్యమే కార్యకర్తలందరూ నీవెంట నడిచేలా చేస్తుందన్నారు. పల్నాడులో ఫ్యాక్షన్‌ను రూపుమాపి అభివృద్ధే ధ్యేయమన్న నీ ఆలోచన గొప్పది.. అదే నీ గెలుపుకు బాట వేస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు.



తుళ్ళూరు శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తం

● 1513వ రోజుకు చేరుకున్న ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ పెద్దల దోపిడీ ఆగటం లేదని, మూడు ముక్కల ఆటతో రాజధాని అమరావతిని నిర్వీర్యం చేశారని 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు బుధవారం నాటికి 1513వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాలు వారు మాట్లాడుతూ పరిపాలనకు పనికిరాని వారిని సలహాదారులుగా పెట్టుకొని, నెలకే కొన్ని కోట్ల రూపాయల ప్రజాధనం తగలేస్తున్నారన్నారు. ప్రజా రాజధాని అమరావతిలో మాత్రం అంగుళం నిర్మాణాన్ని సీఎం జగన్‌రెడ్డి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర పాలన అమరావతి నుండే చేస్తున్నారని, అదే అమరావతి మీద విషం చిమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వీర్యం చేయటానికి కుట్రలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును కూడా అమలు చేయకుండా నాన్చుతున్నారని మండిపడ్డారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం.. ఆ ప్రజలనే మూడు ముక్కల ఆటతో వెన్నుపోటు పొడిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రాజధానులకు స్వస్తి పలికి, రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించి అభివృద్ధిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినానాదాలు చేశారు. మంద డం, తుళ్లూరు, వెంకటపాలెం, నెక్కల్లు, అనంతవరం, వెలగపూడి తదితర రాజధాని గ్రామాలలో రైతుల ఆందోళనలు కొనసాగాయి.



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడిని సన్మానిస్తున్న జయదేవ్, కనకమేడల, రామ్మోహన్‌నాయుడు

అందరివాడు వెంకయ్యనాయుడు

● మాజీ ఉప రాష్ట్రపతిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ ఎంపీలు

గుంటూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో సైద్ధాంతిక విభేదాలే తప్ప వ్యక్తిగత విభేదాలుండవని నమ్మే వెంకయ్యనాయుడు అన్ని పార్టీల నేతలకు మంచి మిత్రుడని, అందరివాడని టీడీపీ పార్లమెంటరీ నేత గల్లా జయదేవ్ అన్నారు. పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడిని టీడీపీ ఎంపీలు గల్లా జయదేవ్ రామ్మోహన్‌నాయుడు, కనకమేడల రవీంద్రకుమార్ బుధవారం ఆయన నివాసంలో కలసి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గల్లా మాట్లాడుతూ దేశరాజకీయాల్లో వెంకయ్యనాయుడు సుదీర్ఘకాలం పాటు సేవలందించారని, ఇందుకుగాను ఆయనకు పద్మవిభూషణ్ అవార్డును ప్రకటించడం సంతోషించదగిన విషయ మన్నారు. విద్యార్థిదశ నుంచి రాజకీయాల్లో క్రియా శీలంగా ఉంటూ దృఢ సంకల్పం, తిరుగులేని క్రమశిక్షణతో ఉపరాష్ట్రపతి పదవివరకు ఎదిగారన్నారు. ఉపరాష్ట్రపతిగా పదవీకాలం ముగిసిన తర్వాత కూడా వెంకయ్యనాయుడు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం ముప్పై ఏళ్లు వెనక్కు

ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, ఫిబ్రవరి7: వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్ళి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడి రెండు నెలలు పనిచెయ్యాలని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. బుధవారం ఉప్పూడి రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి తెచ్చి ప్రజలను ఒక్క ఛాన్స్ అంటూ గద్దెనెక్కిన తర్వాత ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం 30 సంవత్సరాలు వెనక్కి వెళ్ళిందని సమర్థవంతమైన నాయకత్వం లేకపోవటంతో ఏపీని చూసి ఇతర రాష్ట్రాలవారంతా చిన్నతనంగా మాట్లాడుతున్నారన్నారు. రెండు నెలల పాటు కార్యకర్తలు, నాయకులు, కష్టపడి పార్టీ గెలుపుకోసం కృషి చెయ్యాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మురళీధరరావు, మండల పార్టీ అధ్యక్షులు రేపల్లె రామాంజనేయులు, చింతల సుబ్బారావు, వెంకట్‌యాదవ్, మల్లాది రామకృష్ణ, నిజాంపట్నం జడ్పీటీసీ సుబ్బయ్య, టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, జీవీ నాగేశ్వరరావు, వీరయ్య, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, మేకా వెంకట శివరామకృష్ణ, కేసన రామకృష్ణ పాల్గొన్నారు.

1,26,797 మిర్చి టిక్కీలు విక్రయం

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,30,662 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,26,797 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 87,688 మిర్చి టిక్కీలు నిల్వఉన్నట్లు పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.43 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె


ఇంటింటా తిరుగుతూ చీరలు, కరపత్రాలు, సంచులు పంపిణీ చేస్తున్న నరేంద్రవర్మ

ముత్తాయపాలెంను అభివృద్ధి చేస్తా

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఫిబ్రవరి 7 : రాబోయే రోజులలో ముత్తాయపాలెం గ్రామాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదని నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. మండలంలోని ముత్తాయపాలెం గ్రామంలో బుధవారం సాయంత్రం ఇంటింటికి తెలుగుదేశం, మీమాట-నాబాట కార్యక్రమాన్ని పార్టీశ్రేణులతో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేనపార్టీల ఉమ్మడి అభ్యర్థిగా మీ ముందుకొస్తున్నానని అన్నారు. ఎంతోకష్టపడి నిజాయితీగా ప్రజలకు సేవ చేయాలని రాజకీయాలలోకి వచ్చానన్నారు. తెలుగుదేశం పార్టీ బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఒక్కసారి ఓటు వేస్తే శభాష్ అనిపించుకుంటానని అన్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి తన, మన అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా అవినీతి చేస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తులకు అధికారం ఇవ్వటం మన బాపట్లకు అవసరమా అని ప్రశ్నించారు..? అవినీతికి తావులేకుండా పనిచేస్తానని, ఒక్కసారి ఓటు వేసి తెలుగుదేశం, జనసేన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసుకునేందుకు సహకరించాలని నరేంద్రవర్మ కోరారు. అనంతరం ముత్తాయపాలెం సెంటర్‌లో జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, నాయకులు మునేశ్వరరావు, దండమూడి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన తోటల పెంపకంపై శాస్త్రీయ అవగాహన కలిగి ఉండాలి

● అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు

బాపట్ల, ఫిబ్రవరి 7 : ఉద్యాన తోటల పెంపకంపై రైతులు శాస్త్రీయ అవగాహన కలిగియుండాలని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. కళాశాలలో బీఎస్సీ ఫైనలీయర్ చదువుతున్న విద్యార్థుల అనుభవపూర్వక అభ్యాస కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉద్యాన పంటలలో నారు మొక్కల పెంపకం, యాజమాన్యం అనే అంశంపై జరిగిన రైతు శిక్షణా కార్యక్రమంలో అసోసియేట్‌డీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నారుమడుల పెంపకం, అంటుకట్టుట, అంటుతొక్కుట వంటి విధానాలపట్ల రైతులు అవగాహన కలిగియుండాలన్నారు. పండ్లతోటలు, కాయకూరల పెంపకంలో గణనీయమైన పురోగతిని సాధించి పెట్టటమేకాక ఆధునిక రైతులోకానికి ఆర్థికవనరుల పెంపుదలకు దోహదపడుతుందన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతుల అభివృద్ధి కోసం పలుశిక్షణా కార్యక్రమాలను చేపడుతుందని అందులో భాగంగా ఏర్పాటు చేసిన ఈ శిక్షణా కార్యక్రమంలోని శాస్త్రవేత్తల సందేశాలను అవగాహన చేసుకొని ఆ దిశగా వ్యవసాయం చేయాలన్నారు. మిద్దె తోటలు, పెరటి తోటలు, ఆకుకూరల పెంపకం మీద రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులకు గులాబీ, మందారం మొక్కల కాండాలను కత్తిరించు విధానంపై విద్యార్థులు ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.రమాదేవి, డాక్టర్ ఎన్.రత్నకుమారి, డాక్టర్ ఎం.సురేంద్రబాబు, డాక్టర్ సీహెచ్ దుర్గాహేమంత్‌కుమార్, కంకటపాలెం, జమ్ములపాలెం, నందిరాజుతోట గ్రామాల రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు

వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో ముగిసిన శిక్షణ

బాపట్ల, ఫిబ్రవరి 7 : పట్టణంలోని డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రాక్టర్, వ్యవసాయ యంత్రపరికరాల మరమ్మతులు, నిర్వహణపై నైపుణ్యాభివృద్ధి శిక్షణ ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. ఐసీఏఆర్ సౌజన్యంతో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ 2023-2024 పథకం కింద ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమం ముగింపు సభకు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డిడి స్మిత్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణలో వస్తున్న సాంకేతికను రైతులు అందిపుచ్చుకోవాలన్నారు. రైతులకు ప్రతినిత్యం కళాశాల అందుబాటులో ఉంటూ పరిశ్రమల సాంకేతికతను రైతుల దృష్టికి తీసుకొచ్చేవిధంగా వారధిలా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో హాజరైన రైతులకు సాంకేతికత గురించి అవగాహన కల్పిస్తూ తేజస్ 57హెచ్‌పి ట్రాక్టర్ గురించి వివరించి ప్రదర్శించారు. కార్యక్రమంలో ట్రాక్టర్ కంపెనీల ప్రతినిధులు, రైతులు డాక్టర్ బి.జాన్‌వెస్లీ, డాక్టర్ కెవిఎస్.రామిరెడ్డి, డాక్టర్ బి.హరిబాబు, విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన రైతులు, యువతతో అసోసియేట్‌డీన్ డాక్టర్ డీడీ స్మిత్, శాస్త్రవేత్తలు

రెడ్‌క్రాస్ శకట ప్రదర్శనకు ప్రశంసలు

బాపట్ల, ఫిబ్రవరి 7 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మొట్టమొదటిసారిగా బాపట్ల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ వారు శకట ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనకు కలెక్టర్ పి.రంజిత్‌బాషా అభినందనలు తెలిపారు. శకటానికి బుధవారం జ్యూరీ అవార్డు, ప్రశంసపత్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ బి.ఎస్.నారాయణభట్టుకు అందజేశారు. కార్యక్రమంలో డి.వి.రమణబాబు, జూలగంటి సత్యనారాయణరాజుపాల్గొన్నారు.


రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ నారాయణభట్టుకు ప్రశంసపత్రాన్ని అందజేస్తున్న డీఆర్వో వెంకటరమణ

చెరువు నిండేనా.. ప్రతిరోజు నీరు అందేనా?

● బాపట్ల పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు ● చెరువు డెడ్‌స్టోరేజికి చేరుకున్నాక స్పందించిన అధికారులు, పాలకులు


పీటీ ఛానల్‌లోని నీటిని చెరువులోకి ఇంజన్లతో నింపుతున్న అధికారులు

బాపట్ల, ఫిబ్రవరి 7 : బాపట్ల పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పటంలేదు. ప్రతిఏడాది వేసవిలో మాత్రమే రోజుమార్చి రోజు తాగునీటిని సరఫరా చేసేవారు. ఈ ఏడాది పెరిగిన పట్టణ జనాభా, జిల్లా కేంద్రం కావటం వంటి కారణాలతో నీటి వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. దీనివల్ల ఏప్రిల్ నెల వరకు రావాల్సిన నీరు ఫిబ్రవరి ప్రారంభంలోనే అడుగంటింది. దీనిని అధికారులు, పాలకులు గుర్తించకపోవటం వల్ల సమస్య తీవ్రరూపం దాల్చింది. చెరువులో నీరు కనీసం వారం రోజులు కూడా వచ్చే పరిస్థితి కనిపించటంలేదు. ఎట్టకేలకు గుర్తించిన అధికారులు సమస్యను పరిష్కరించేందుకు ఆలస్యంగా స్పందించారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి పిటిఛానల్‌కు నీరు వచ్చే విధంగా చేశారు. అప్పటికే చెరువులోనీరు అడుగంటటంతో ప్రతిరోజు సరఫరా చేయాల్సిన తాగునీటిని రోజుమార్చిరోజు సరఫరా చేయాలని నిర్ణయించారు. కాల్వకు నీరు వచ్చినా, ఇంజన్లతో చెరువు నింపే ఏర్పాట్లు చేసిన అధికారులకు అపనమ్మకం ఏర్పడి ఇప్పటికి రోజుమార్చి రోజు మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. చెరువులో నీరు 10 అడుగులకు చేరుకుంది. ఇందులో మూడు అడుగుల నీటిని మాత్రమే వినియోగించుకునే అవకాశం ఉంది. మిగిలిన 7 అడుగుల నీరు బురదతో ఉంటుంది కావున వినియోగానికి పనికిరాదు. ప్రస్తుతం ఇంజన్లు ఏర్పాటు చేసి మరో 5 అడుగులు నీటిని నింపినప్పటికి తాగునీటి అవసరాలకు ఎన్ని రోజులు వస్తుందోనంటూ అధికారులు ప్రతిరోజు నీటిని సరఫరా చేసే ఆలోచన చేయటంలేదు. మురికివాడల ప్రజల పరిస్థితి అయితే దయనీయంగా ఉంది. జగనన్నకాలనీలకు సక్రమంగా నీటిని సరఫరా చేయటంలేదని ఆప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీటిని కేవలం కొన్ని కుటుంబాలకు మాత్రమే ఇచ్చి మిగిలినవారికి పంపిణీ చేయటంలేదనే విమర్శలు వస్తున్నాయి. కొంతమంది బుధవారం దీనిపై మున్సిపల్ డీఈ కె.శ్రీనివాసులకు ఫిర్యాదు కూడా చేశారు. పట్టణంలోని 34వార్డుల ప్రజలు ఒకపూట పట్టుకున్న నీటిని రెండురోజులు వాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇలాంటి పరిస్థితి రావటంపై పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున విమర్శలు చేస్తున్నారు.

17 ఇంజన్లు ఏర్పాట్లు చేశాం

సమ్మర్‌స్టోరేజి ట్యాంక్‌ను నీటితో నింపేందుకు 17 ఇంజన్లు ఏర్పాటు చేశాం. నూతనంగా తాను బాధ్యతలు చేపట్టిన రోజు చెరువులో నీరు కేవలం 10 అడుగులు మాత్రమే ఉంది. ఇప్పుడు ఇంజన్ల ద్వారా 5 అడుగులు నింపగలిగాం. చెరువును పూర్తి స్థాయిలో 24 అడుగులు నింపి తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తాం. ప్రస్తుతానికి రోజుమార్చిరోజు మాత్రమే సరఫరా చేస్తాం. చెరువు పూర్తిగా నింపిన తర్వాత ప్రతిరోజు నీటిని సరఫరా చేసే విషయాన్ని పరిశీలిస్తాం. 60 హెచ్‌పీ ఇంజన్లు 2, 40 హెచ్‌పీ ఇంజన్లు 4, 10 హెచ్‌పి ఇంజన్లు 7, 8 హెచ్‌పీ ఇంజన్లు 4 చొప్పున ఏర్పాటు చేసి నీటిని చెరువులోకి నింపుతున్నాం. - మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి.

ఆశా వర్కర్ల అరెస్టు అప్రజాస్వామికం : సీఐటీయూ


భట్టిప్రోలు పోలీస్‌స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 7 : న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు ఈనెల 8న ఛలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చారని, ఆశా వర్కర్లను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడం అప్రజాస్వామికమని సీఐటీయూ నాయకుడు జి.సుధాకర్ తీవ్రంగా ఖండించారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఆశావర్కర్లను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడాన్ని నిరసిస్తూ ఆశా వర్కర్లకు మద్దతుగా సీఐటీయూ నాయకులు జి. సుధాకర్ స్థానిక స్టేషన్‌లో బైఠాయించారు. విజయవాడ వెళ్ళకుండా ముందస్తుగా ఆశా వర్కర్లను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఛలో విజయవాడ కార్యక్రమంలో ఆశా వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సుధాకర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ లీడర్లు నిర్మల, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

● వేమూరు, ఫిబ్రవరి 7 : ఆశా వర్కర్ల అపరిష్కృత సమస్యల పరిష్కారం నిమిత్తం రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు గురువారం ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. గ్రామాల్లోని ఆశా వర్కర్లు, ఏ ఒక్కరూ ఛలో విజయవాడ కార్యక్రమానికి వెళ్ళకుండా భగ్నం చేసేందుకు బుధవారం పోలీసులు ఆశా వర్కర్లకు ఫోన్ చేసి భయపెట్టారు. వర్కర్లకు నోటీసులు జారీ చేయకుండా అరెస్టులు చేశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 50 మందికిపైగా ఆశా వర్కర్లను అరెస్టు చేసినట్లు సమాచారం. అరెస్టు అయిన వారంతా పోలీస్ స్టేషన్ల ముందు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ నాయకుడు అగస్టీన్ ఈ చర్యను నిరశించారు. సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేసే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని దానిని భగ్నం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం సరికాదన్నారు. ఇలా చేస్తే ప్రజలు, ఉద్యోగులు ప్రభుత్వానికి బుద్ధి చెప్పే విధంగా ఆలోచన చేస్తారని హెచ్చరించారు.

● అమృతలూరు, ఫిబ్రవరి 7 : ఆశా వర్కర్స్ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి ఎలాంటి అనుమతులు లేవంటూ ఆశా సిబ్బందిని పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలో విజయవాడ కార్యక్రమాన్ని ప్రభుత్వం పోలీసులతో భగ్నం చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. డ్యూటీల్లో ఉన్న తమని నోటీసులు కూడా ఇవ్వకుండా అరెస్టు చేయడం దుర్మార్గం అన్నారు. సాయంత్రం 6 గంటలు దాటినా పోలీసులు విడిచిపెట్టకుండా స్టేషన్‌లోనే ఉంచడం ప్రభుత్వం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు.



పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న ఆశా వర్కర్స్

కర్లపాలెం, తుమ్మలపల్లిలో దుప్పట్లు పంపిణీ

కర్లపాలెం, ఫిబ్రవరి 7 : మండలంలోని తుమ్మలపల్లి, కర్లపాలెం గ్రామాలలో కోన చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో పెన్షన్‌దారులకు బుధవారం దుప్పట్లు పంపిణి ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే కోన రఘుపతి, ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్‌లు పాల్గొని దుప్పట్లు పంపిణీ చేశారు. ముందుగా కోన రఘుపతి, కోన వెంకట్‌లకు కర్లపాలెం సర్పంచ్ నక్కా లలితకుమారి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. మండలంలోని తుమ్మలపల్లిలో మండలపరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన చేతిపంపును కోన వెంకట్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ సీతారామిరెడ్డి, సర్పంచ్‌లు దబ్బకూటి ఏడుకొండలు, నక్కా లలితకుమారి, వైసీపీ మండల అధ్యక్షులు యల్లావుల ఏడుకొండలు, మందపాటి పరమానందకుమార్, సొసైటీ అధ్యక్షులు మరకా పెద్దఅబ్బాయి. బెనర్జి, ఇస్సాకు, మండలంలోని వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ

వేమూరు, ఫిబ్రవరి 7 : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా స్కిల్ హబ్లో భాగంగా నిరుద్యోగ యువతకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ అధికారి తమ్మాజీరావు తెలిపారు. ఉచితంగా రెండు నెలల పాటు ఇంటర్మీడియట్ ఐటీఐ, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులకు డేటా ఎంట్రీ ఆపరేటర్, కుట్టు మిషన్‌పై ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. 18 సంవత్సరాలపైబడిన స్త్రీలు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా సర్టిఫికెట్లు అందించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. వివరాలకు వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల సెల్ నెం.8978886348, 9032384374. టోల్ ఫ్రీ నెం.9988853355నంబర్లను సంప్రదించాలన్నారు.

ఎప్పటి దరఖాస్తులు అప్పుడే పరిష్కరించాలి : కమిషనర్

బాపట్ల,ఫిబ్రవరి 7 : ఓటర్లకు సంబంధించిన దరఖాస్తులు ఎప్పటికప్పుడే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి బీఎల్వోలను ఆదేశించారు. ఈ విషయమై బుధవారం మున్సిపల్ కార్యాలయంలో బీఎల్‌వోలతో ఆయన సమావేశమయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ ఓటర్ల చేర్పులు, మార్పులకు సంబంధించిన దరఖాస్తులు పరిష్కరించటంతోపాటు తొలిగింపులకు సంబంధించిన దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిశీలించి విచారించి తగిన నివేదిక ఇవ్వాలన్నారు. డెత్ కేసుల విషయంలో కూడా విచారణ చేసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి ఆయన పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలన్నారు. పోలింగ్‌బూత్‌లను మరోసారి పరిశీలించి ఏమైనా అవసరాలు ఉంటే గుర్తించి వాటిని ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో బీఎల్‌వోలుపాల్గొన్నారు.


బీఎల్‌వోల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రామచంద్రారెడ్డి

డ్రైనేజిలో పూడిక పూర్తి స్థాయిలో తొలిగించాలి

బాపట్ల,ఫిబ్రవరి 7 : డ్రైనేజిలలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలిగించి మురుగునీరు సక్రమంగా ప్రవహించే విధంగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి శానిటరి సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని 11వవార్డు ఇందిరానగర్ కాలనీలో బుధవారం పారిశుధ్య పనులను కమిషనర్ తనిఖీ చేశారు. చెత్త నిల్వలు లేకుండా వార్డులు పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికుల ద్వారా పనులు చేయించాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఈ ఉమామహేశ్వరరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్, మేస్త్రీలు పాల్గొన్నారు.

వేమూరులో మారని తీరు

● ప్రభుత్వ కార్యక్రమంలో వైసీపీ ఇన్‌చార్జి
● అత్యుత్సాహం చూపిన ఉద్యోగులు
● తీవ్రంగా విమర్శిస్తున్న ప్రతిపక్షం

వేమూరు, ఫిబ్రవరి 7 : వేమూరు నియోజకవర్గంలో రెండు మాసాల నుంచి జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమాల్లో వైసీపీ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న వరికూటి అశోక్‌బాబు బుధవారం వేమూరులో జరిగిన ఆసరా కార్యక్రమంలో అత్యుత్సాహంగా పాల్గొన్నారు. ఇంతవరకు జరిగిన ప్రభుత్వ కార్యక్రమాలకు ఎలాంటి ప్రజాప్రతినిధి బాధ్యత లేకపోయినప్పటికీ తప్పని పరిస్థితుల్లో అధికారులు, ఆయనను ఆహ్వానించడం ఆయన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడం జరుగుతోంది. ఈ విషయాన్ని దినపత్రికలు ప్రచురించినప్పటికీ ఆయన తీరు మారడం లేదు. ప్రభుత్వ అధికారులు కూడా ఒకే పందాలో వ్యవహరిస్తున్నారు. దీనిపై ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన పార్టీ నేతలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఆసరా కార్యక్రమం ప్రభుత్వ కార్యక్రమం అయినప్పటికీ అశోక్‌బాబు తన చేతుల మీదుగా డ్వాక్రా గ్రూపులకు ఆసరా పథకం ద్వారా విడుదలైన నిధులు రూ.7.89 కోట్లు చెక్కును అందించారు. మహిళలతో కలసి ఆయన ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దీనిపై ఉన్నతాధికారులు కూడా స్పందించకపోవడం ఆశ్చర్యంగా ఉందని ప్రతిపక్షాలు అంటున్నాయి.


ఆసరా కార్యక్రమం జరుగుతుండగానే సభ నుంచి వెళ్ళిపోతున్న డ్వాక్రా మహిళలు

ఆసరా కార్యక్రమం వద్ద రచ్చ రచ్చ

వేమూరులో బుధవారం నిర్వహించిన ఆసరా కార్యక్రమం చెక్కు పంపిణీ కార్యక్రమానికి 17 గ్రామాల నుండి 3 వేల మందికిపైగా డ్వాక్రా మహిళలు హాజరయ్యారు. సభ నిర్వహణ వరకు ఏర్పాట్లు బాగానే చేసినప్పటికీ భోజనం సమయంలో వైసీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అందరికీ పలావు పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఒక పక్క సభ జరుగుతుండగానే భోజన సమయం కావడంతో మరో ప్రక్క పలావ్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీంతో ఆకలితో ఉన్న మహిళలంతా ఒకేసారిగా ప్లేట్లు పట్టుకొని పంపిణీ దగ్గరకు తోసుకుంటూ వెళ్ళారు. నిర్వహణ లోపం వల్ల భోజన పంపిణీ కార్యక్రమం రచ్చరచ్చగా మారింది. అనేక మంది మహిళలు ఆ తోపులాటలో తట్టుకోలేక తిరిగి వెళ్ళిపోయారు. మరి కొందరు ప్లేట్లలో పెట్టించుకున్న పలావ్ తినడానికి సౌకర్యం లేక రోడ్లపైన కూర్చుని భోజనం చేశారు. తోపులాట నియంత్రించేందుకు పోలీసులు కూడా ప్రవేశించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కార్యక్రమంలో జడ్పీటీసీ గాజుల హేమలత, యార్డు ఛైర్మన్ శిరీష, మాజీ ఛైర్మన్ ఏడుకొండలు, సొసైటీ అధ్యక్షులు భానుప్రకాష్, మండల సమాఖ్య అధ్యక్షురాలు దాసరి థెరీసా, కో ఆర్డినేటర్ శ్రీలక్ష్మీ, ఏపీఎం శోభన్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

వేమూరు, ఫిబ్రవరి 7 : వేమూరులో నాబార్డు నిధులు రూ.8.06 కోట్ల వ్యయంతో ఆధునిక సౌకర్యాలతో నిర్మితమైన సామాజిక ఆరోగ్య కేంద్ర భవనాల సముదాయాన్ని గురువారం రాష్ట్ర సాంఘీక, సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున చేతుల మీదుగా ప్రారంభిస్తారని వైద్యశాల అధికారులు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య శాఖ మంత్రి విడదల రజని హాజరవుతారు. నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్త వరికూటి అశోక్‌బాబు, కలెక్టర్ రంజిత్‌బాషా, మరి కొందరు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు హాజరవుతారని తెలిపారు.



రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఏపీసీసీ చీఫ్ వై.ఎస్.షర్మిలరెడ్డి

షర్మిలకు బాపట్లలో బ్రహ్మరథం

● అడుగడుగున స్వాగతం పలికిన కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు
● పట్టణంలో ప్రజలకు అభివాదం చేస్తూ షర్మిల రోడ్‌షో

బాపట్ల,ఫిబ్రవరి 7 : ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలరెడ్డికి బాపట్లలో కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు, అభిమానులు బ్రహ్మరథం పట్టారు. పొన్నూరు నుంచి రోడ్డుమార్గాన బాపట్ల విచ్చేసిన షర్మిలకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అడుగడుగున స్వాగతం పలికారు. గుంటూరురోడ్డులోని ఆర్‌వోబి దగ్గర నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ప్రజలకు అభివాదం చేస్తూ షర్మిల రోడ్‌షో నిర్వహించారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద కార్యకర్తలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా కేరింతలు కొడుతూ ఆమె పర్యటనలో పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గంటా అంజిబాబు నాయకత్వంలో ప్రతినియోజకవర్గం నుంచి ప్రజలు ప్రత్యేక వాహనాలలో తరలివచ్చారు. షర్మిలను చూచేందుకు ప్రజలతోపాటు వైసీపీకి వ్యతిరేకమైనవారు కూడా పెద్దసంఖ్యలో విచ్చేసి ఉత్సాహంగా కేరింతలు కొడుతూ ఆమె పర్యటనలో పాల్గొన్నారు. విద్యార్థులు జెండాలు పట్టి పెద్దఎత్తున నినాదాలు చేస్తూ రోడ్‌షోలో పాల్గొనటం ప్రత్యేకార్షణగా నిలిచింది. మహిళలు నేను సైతమంటూ అంబేద్కర్ సర్కిల్ వరకు నడిచి అక్కడ సభ ముగిసే వరకు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, పార్లమెంట్ పరిశీలకులు శ్రీపతి ప్రకాష్, జిల్లాకాంగ్రెస్ అధ్యక్షులు గంటా అంజిబాబు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పఠాన్ రాజేష్, రాష్ట్రనాయకులు షేక్ మస్తాన్‌వలి, కనుమూరి భాగ్యరాజు, జాతీయ నాయకులు కుప్పం రాజు, రఘువీరారెడ్డి, వేమూరు నియోజకవర్గ నాయకులు తాడికొండ వెంకటేశ్వరరావు, బురుగ సుబ్బారావు, అద్దంకి నాయకులు కె.సురేంద్ర, పర్చూరు నాయకులు తోట శివనాగేశ్వరరావు, చీరాల నాయకులు దేవరపల్లి రంగారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దోనేపూడి దేవరాజు, మండలపార్టీ అధ్యక్షులు పి.శంకరరెడ్డి, మహిళా అధ్యక్షురాలు ద ండు రేణుక, సీనియర్ నాయకులు చింతా బాబురావు, శీలం సాగర్, ఎస్‌విఆర్ కుమార్, దోనేపూడి రవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాపట్ల ఇంజనీరింగ్ కాలేజిలో పార్టీశ్రేణులతో షర్మిల సమావేశమయ్యారు.

హోమ్ ఓటింగ్ విధానం అమలలోకి తెచ్చేందుకు ఏర్పాట్లు : కలెక్టర్


రాజకీయపార్టీల నాయకులతో సమావేశమైన కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, ఫిబ్రవరి 7 : హోమ్ ఓటింగ్ విధానం అమలులోకి తెచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులతో బుధవారం కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ హోమ్‌ఓటింగ్ విధానం ప్రవేశపెట్టటానికి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు విడుదల చేసిందని చెప్పారు. ఇందు కోసం అధికారులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. దివ్యాంగులు, 80 సంవత్సరాలు దాటిన వృద్ధులు తమ ఓటు హక్కు ఇంటివద్దనే వినియోగించుకోవటానికి నూతన విధానం ఎంతో ఉపకరిస్తుందన్నారు. సవరణ ఓటర్ల జాబితా ఎన్నికల సమయానికి సిద్ధం చేస్తామన్నారు. ఓటర్ల తుది జాబిత విడుదల చేసిన జనవరి 22వ తేదీ నుంచి ఇప్పటి వరకు 13,855 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిన్నిటిని పరిశీలిస్తున్నామని కలెక్టర్ వివరించారు. జీవనోపాధి కొరకు తాత్కాలికంగా విదేశాలకు వెళ్ళిన ఓటర్లను ఓవర్సీస్ ఓటర్లుగా నమోదు చేశామన్నారు. ఓవర్సీస్ ఓటర్లు పర్చూరు నియోజకవర్గంలో 345 మంది ఉన్నాయన్నారు. సమావేశంలో డీఆర్వో పి.వెంకటరమణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణకాంత్, బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు, బీజేపీనాయకులు కెవి.రామకృష్ణ, సీపీఎం నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, కాంగ్రెస్‌నాయకులు దోనేపూడి రవి, టీడీపీనాయకులు షేక్.గౌస్‌బాషా, వైసీపీనాయకులు ఇనగలూరి మాల్యాద్రి పాల్గొన్నారు.

గ్రామదర్శిని చిత్తశుద్ధితో నిర్వహించాలి

బాపట్ల, ఫిబ్రవరి 7 : గ్రామదర్శిని కార్యక్రమాన్ని జిల్లా అధికారులు చిత్తశుద్ధితో నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై మండల, జిల్లా స్థాయి అధికారులతో బుధవారం కలెక్టరేట్ నుంచి వీక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు ప్రజలకు అందించటానికి గ్రామదర్శిని కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేకాధికారులుగా 70మందిని నియమించామన్నారు. ఈనెల 9వ తేదీ నుంచి 70గ్రామాలలో అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేయాలన్నారు. ఇప్పటికే రెండు పర్యాయాలు గ్రామదర్శిని కార్యక్రమాన్ని చేపట్టగా 1245 సమస్యలు గుర్తించామన్నారు. అందులో 1000 సమస్యలు పరిష్కరించామన్నారు. ఆరోగ్యశ్రీకార్డులు జిల్లాకు 3,78,000 కాగా 2.27 లక్షలు ఎందుకు పంపిణీ చేయలేదని అధికారులను నిలదీశారు. చినగంజాం, చీరాల, మార్టూరు, చెరుకుపల్లి, నిజాంపట్నం, అమర్తలూరు మండలాలలో పంపిణీ జాప్యంపై ఆరా తీశారు. విధినిర్వహణలో నిర్లిప్తత విడనాడాలన్నారు. కులగణన సర్వేప్రక్రియ రాష్ట్రమంతా 90శాతం పూర్తికాగా జిల్లాలోని సంతమాగులూరులో 85 శాతం, కొరిశపాడులో 86 శాతం పురోగతి ఏమిటని నిలదీశారు. జగనన్నకాలనీలలో 899 గృహ నిర్మాణాలు తుది దశకు చేరాయని కలెక్టర్ చెప్పారు. నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోకపోవటం ఏమిటని అధికారులు ప్రశ్నించారు. స్వయం సహాయక సంఘాలలోని 1201 మంది మహిళలకు రుణసదుపాయం కల్పించాలన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌లు మండలాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి నివేదిక పంపాలన్నారు. దివ్యాంగులు, 80 సంవత్సరాలు దాటిన వారి వివరాలు పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో రేపల్లె ఆర్డీవో హేలా షారోను, హౌసింగ్ పీడీ ప్రసాద్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, డ్వామా పీడీ డాక్టర్ బి.అర్జునరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ హరేరామకృష్ణ పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణ మనందరి బాధ్యత

భట్టిప్రోలు, ఫిబ్రవరి 7 : హిందూ ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ మండల స్థాయి సమావేశం స్థానిక సాయికృష్ణ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడం కోసం హిందూ ధర్మ పరిరక్షణకు ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. అనంతరం ధర్మనిధి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు క్రాప రవికుమార్, పొన్నపల్లి సత్యనారాయణ, బూర్లె అరుణకుమారి, బొర్రా లక్ష్మీరాణి, చింతల మురళీకృష్ణ, ఉప్పాల శ్రీనివాసరావు, జంపని శివదుర్గా ప్రసాద్, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలు ప్రారంభించనున్న మంత్రి నాగార్జున

కొల్లూరు, ఫిబ్రవరి 7 : నూతనంగా నిర్మాణం చేసిన సచివాలయాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున గురువారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మీకుమారి బుధవారం తెలిపారు. కొల్లూరులోని సచివాలయం-3, మండల గ్రామం జువ్వలపాలెంలో నిర్మించిన సచివాలయాన్ని మంత్రి ప్రారంభిస్తారని, వీటితో పాటు సీసీ రోడ్లు, కాంపౌండ్ వాల్స్ కూడా ప్రారంభించనున్నట్లు చెప్పారు. నాలుగో విడత ఆసరా పథకం కింద మహిళలకు పంపిణీ చేస్తారని ఎంపీడీవో పేర్కొన్నారు. కార్యక్రమాలలో నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు కూడా పాల్గొంటారని తెలియజేశారు.

వేమూరు తహసీల్దార్‌గా కిరణ్

వేమూరు, ఫిబ్రవరి 7 : వేమూరు తహసీల్దార్‌గా వి.కిరణ్‌బాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ దృష్ట్యా ప్రారంభించిన బదిలీల పర్వంలో భాగంగా వేమూరులో పని చేస్తున్న నాగరాజారావును నెల్లూరుకు బదిలీ చేశారు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం తహసీల్దార్‌గా పని చేస్తున్న కిరణ్‌ను వేమూరుకు బదిలీ చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు నుంచి ఆయన పూర్తి బాధ్యతలను స్వీకరించారు.



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న ఉప్పుటూరు గ్రామస్థులు

శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించండి

● కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన ఉప్పుటూరు గ్రామ ముస్లింలు

పర్చూరు, ఫిబ్రవరి 7: వాడరేవు - పిడుగురాళ్ళ హైవే రహదారి నిర్మాణంలో శ్మశాన వాటిక స్థలాన్ని కోల్పోతున్నామని, తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతంలో తిరిగి స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్ రంజిత్ బాషాకు మండలంలోని ఉప్పుటూరు గ్రామ ముస్లింలు వినతి పత్రం అందజేశారు. బుధవారం పర్చూరులోని అద్దంకి నాంచారమ్మ కల్యాణ మండపంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా స్పందన కార్యక్రమం నిర్వహించారు. డ్రైనేజీలు, రోడ్లు, పట్టాదారు పాసుపుస్తకాలు తదితర అంశాలకు సంబంధించిన అర్జీలను కలెక్టర్ స్వయంగా స్వీకరించి పరిశీలించారు. మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన రైతులు ఇనాం భూములకు పట్టాలు మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. జగనన్న పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎంతవరకు వచ్చింది. పురోగతి ఏమిటి ? అన్న విషయాన్ని జిల్లా రిజిస్ట్రార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అర్జీల రూపంలో వచ్చిన సమస్యలను త్వరిత గతిన పరిష్కరించే విధంగా అధికారులు దృష్టిసారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవీందర్, మండల ప్రత్యేక అధికారి రామకృష్ణ, తహసీల్దార్ సీహెచ్.సుబ్బయ్య, సంధ్యశ్రీ, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



గెలుపొందిన క్రీడాకారులతో సెయింట్‌ఆన్స్ కళాశాల ప్రతినిధులు

వాలీబాల్ విన్నర్స్‌గా సెయింట్‌ఆన్స్ కళాశాల జట్టు

చీరాల,ఫిబ్రవరి 7 : విజ్ఞాన్ మహోత్సవ్ - 2024లో భాగంగా నిర్వహించిన అంతర్ ఇంజనీరింగ్ కళాశాలల క్రీడా పోటీలలో వాలీబాల్ విభాగంలో సెయింట్‌ఆన్స్ కళాశాల జట్టు విజేతగా నిలిచినట్లు కళాశాల ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావులు క్రీడాకారులను అభినందించారు. కళాశాల పీఈటీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలలో 8 యూనివర్శిటీల నుంచి 50 జట్లు ఈ పోటీలలో పాల్గొన్నాయన్నారు. విన్నర్స్‌గా నిలిచిన తమ జట్టుకు రూ.30వేలు నగదు బహుమతితో పాటు జట్టులోని క్రీడాకారులకు వ్యక్తిగత మెడల్స్ అందజేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు,వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పారిశుధ్య నివారణపై జరిగిన శిక్షణలో మాట్లాడుతున్న అధికారులు

పారిశుధ్యం మెరుగుదలపై ప్రజలకు అవగాహన

బల్లికురవ. ఫిబ్రవరి7 : గ్రామాలలో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగుదల అయ్యేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి కోరారు. బుధవారం బల్లికురవ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి సెర్ప్ ఆధ్వర్యంలో పారిశుధ్యంపై శిక్షణ కార్యక్రమం కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరావు నేతృత్వంలో జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో తడి పొడి చెత్త ఎక్కడ పడితే అక్కడ పడవేయటం వలన సీజనల్‌గా వ్యాధులు వస్తున్నాయన్నారు. ప్రతి రోజు పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలానే మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. వ్యర్థాలను చెత్త సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. ఈశిక్షణలో ఎంపీడీవో హనుమారెడ్డి, ఈవోపీఆర్డీ సుమతి, సెర్ప్ సంస్థ కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరావు, శిక్షకులు ప్రదీప్, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

దేవాంగులకు సీట్లు కేటాయించాలి

వేటపాలెం(చీరాల),ఫిబ్రవరి 7 : రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు దేవాగుంలకు నిర్ణీత సీట్లు కేటాయించాలని దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుచ్చల రామకృష్ణ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని దేశాయిపేటలో సంఘీయులతో కలసి మాట్లాడారు. చీరాల, రాజమండ్రి రూరల్, పుట్టపర్తి అసెంబ్లీ స్థానాలను, హిందూపురం ఎంపీ స్థానాన్ని తాము దేవాంగులకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దేవాంగ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుర్మా రాహుల్జి, యారాసు అరుణ్‌బాబు, దేవల మనుబ్రహ్మ, దేవాంగ సంఘ అధ్యక్షుడు వొలుకుల మోహనరావు, కార్యదర్శి చల్లా విజయ్, మీడియా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా కదలని శుద్ధిజల ప్లాంటు

పూర్తిగా నిలిచిపోయిన పథకం పనులు

పట్టించుకోని ప్రభుత్వం

అద్దంకి, ఫిబ్రవరి7: గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ ధరకు శుద్ధి జలం అందించాలన్న ఉద్దేశంతో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో శింగరకొండ వద్ద రూ. 1.50 కోట్ల వ్యయంతో శుద్ధిజల ప్లాంట్ నిర్మాణం ప్రారంభించారు. అద్దంకి, బల్లికురవ మండలాలలోని 21 గ్రామాల ప్రజలకు తక్కువ ధరలో ఈ జలాన్ని ఇళ్ల వద్దకే సరఫరా చేసే విధంగా ప్లాంట్ రూపకల్పన చేశారు. 2018 ఫిబ్రవరి 16 వ తేదీని అప్పటి కలెక్టర్ వినయ్‌చంద్, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేశారు. అనంతరం భవనాసి చెరువులో ఇన్‌టేక్ వెల్ నిర్మాణం, అక్కడ నుంచి శింగరకొండ వద్ద ట్యాంక్ వరకు పైప్‌లైన్ నిర్మాణం జరిగాయి. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోకపోవడంతో పనులు పూర్తి గా నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాలకు శుద్ధిజలం సరఫరా ఎండమావిగానే మారాయి. ఆయా గ్రామాలలో ప్రయివేట్ వాటర్ ప్లాంట్‌ల ద్వారా ఎక్కువ ధరకు జలాన్ని ప్రజలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అర్థాంతరంగా ఆగిపోయిన పనులు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





శింగరకొండ వద్ద భవనాసి చెరువులో ఏర్పాటు చేసిన ఇన్‌టేక్‌వెల్ (ఇన్‌సెట్లో) నిరుపయోగంగా ఉన్న వాటర్‌ట్యాంక్

స్పందనలో ఫిర్యాదుపై జేసీ విచారణ

మార్టూరు , ఫిబ్రవరి 7: కలెక్టర్‌కు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేశారు. గత ఏడాది డిసెంబర్ 31 తేదీన మండలంలోని కోణంకి గ్రామంలో ఫాం 7పై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామానికి భారీగా పోలీసులు వచ్చారు. ఓట్ల విచారణలో ఫాం 7కు సంబంధించి లబ్ధిదారులను విచారణ చేసేందుకు రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్న సమయంలో భారీగా పోలీసులు చేరుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఫాం -7లో పేర్లు ఉన్న సందెపోగు శోభారాణి, భార్య భర్తలు జొన్నలగడ్డ రామయ్య, రిబకా దంపతులు ఓట్ల విచారణలో పోలీసులు తమను భయభ్రాంతులకు గురి చేశారని, జనవరి నెలలో కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు జేసీ శ్రీధర్ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదుదారులను పిలిపించి విచారించారు. అదే విధంగా కోణంకి గ్రామానికి చెందిన ఉప్పలపాటి అశోక్ అనే యువకుడు తన ఓటు తొలగించారని కలెక్టర్‌కు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ యువకుడిని కూడా జేసీ విచారించారు. ఈ గ్రామంలో గ్రామానికి చెందిన ఒక వ్యక్తి భారీగా ఓటర్లను తొలగించాలనే ఉద్దేశంతో భారీగా ఫాం7లు దాఖలు చేశారు. అయితే వారు అందరు తాముకు ఓటు హక్కు ఉన్నట్లు సంబంధిత పత్రాలను రెవెన్యూ అధికారులకు సమర్పించారు. అదే విధంగా స్పందనలో ఇచ్చిన ఫిర్యాదుదారులు కూడా తమ పత్రాలను రెవెన్యూ అధికారులకు సమర్పించారు. ఈ విషయమై జేసీ శ్రీధర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా పోలీసులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, స్పందనలో ఫిర్యాదుదారులు ఇచ్చిన అర్జీ మేరకు, కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేశామని తెలిపారు.

విద్యార్థులు చిన్నతనం నుంచే ఆరోగ్యసూత్రాలు పాటించాలి

ఇంకొల్లు, ఫిబ్రవరి 7: విద్యార్థులు చిన్నతనం నుంచి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఆరోగ్య సూత్రాలను పాటించి ఆరోగ్యవంతులుగా ఉండాలని మార్టూరు రోటరీక్లబ్ అధ్యక్షులు తాళ్లూరి సాంబశివరావు సూచించారు. మండలంలోని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు రూ. 12 లక్షలతో మార్టూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో హ్యాండ్‌వాష్, ఆర్వోప్లాంటు, టాయిలెట్స్ ఏర్పాటు చేశామని బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన గుర్తు చేశారు. విద్యార్థులు వీటిని పూర్తిస్థాయిలో సద్వినియోగపరచుకోవాలన్నారు. ఆరోగ్య సూత్రాలు వివరించారు.ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ పూర్వ అధ్యక్షులు జాష్టి సాంబశివరావు,రోటరీ సభ్యులు దొడ్డా మహేందర్, మాదాల సాంబశివరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిడపర్తి పేరిరెడ్డి పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయాలి

ఇంకొల్లు, ఫిబ్రవరి 7: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్తంగా జరగనున్న బంద్‌లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని బాపట్ల జిల్లా రైతు సంఘం నాయకులు కందిమళ్ళ రామకోటేశ్వరరావు కోరారు. ఇంకొల్లులో బుధవారం నార్నెసింగయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఢిల్లీలో రైతు ఉద్యమంతో కేంద్రప్రభుత్వం వెనక్కి తీసుకున్నట్లు పార్లమెంటులో ప్రకటించి ఆచరణలో జాప్యం చేస్తున్నదని, ఇందుకు నిరసనగా ఈ నెల 16న జరిగే బంద్‌లో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని రామకోటేశ్వరరావు కోరారు. బాచిన కోటేశ్వరరావు, అన్నెం ఆదెయ్య బండి సాంబయ్య, చిలుకూరి శ్రీనివాసరావు,హరిబాబు, శంకరరావు, సుబ్బారావు, అంజియ్య, హనుమంతరావు పాల్గొన్నారు.

బినామి పేర్లు తొలగించాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 7: అద్దంకి పట్టణంలో కార్పెంటర్లకు వుడ్ కాంప్లెక్స్ ప్లాట్లలో బినామీ పేర్లు పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని అద్దంకి పట్టణ కార్పెంటర్ నాయకుడు ఆళ్ళగడ్డ వీర సుందరాచారి కోరారు.

ఆర్టీసీ ఆదాయం పెంపునకు కష్టపడి పనిచేయాలి

అద్దంకి, ఫిబ్రవరి7: ఆర్టీసీ ఆదాయం పెంపునకు ప్రతి ఉద్యోగి కష్టపడి పనిచేయాలని ఆర్టీసీ (పీటీడీ) డైరెక్టర్ ఎ. రాజారెడ్డి అన్నారు. బుధవారం అద్దంకి డిపో లో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ముందుగా గ్యారేజ్ ఆవరణలో రాజారెడ్డి మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఖాళీ స్థలాలను అద్దెకు ఇవ్వటం, కార్గో ఆదాయం పెంచటం ద్వారా ఆర్టీసీకి అదనపు ఆదాయం పెంచవచ్చన్నారు. సామాన్య ప్రయాణికుడు కూడా విలాసవంతమైన, సురక్షితమైన ప్రయాణం చేయాలనే ఉద్దేశంతో త్వరలో వెయ్యి ఎలక్ట్రికల్ బస్సులు, 1500 డీజిల్ బస్సులు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఆయన వెంట చీరాల డీఎం శ్యామల, అసిస్టెంట్ డీఎం మహబూబి, పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.



డిపోలో కార్మికులు, మహిళా ఉద్యోగులతో మాట్లాడుతున్న ఏపీఎస్ఆర్‌టీసీ(పీటీడీ) డైరెక్టర్ నాగిరెడ్డి

వైసీపీ విజయానికి కృషి చేయాలని చెప్పటంపై పెదవి విరుపు....

కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు పోయి పరిష్కారానికి కృషి చేస్తారని కార్మికులు భావించారు. కార్మికులతో సమావేశం సందర్భంగా డైరెక్టర్ నాగిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా ఉండగా ఆర్టీసీకి నష్టం కలిగే విధంగా వ్యవహరించారని, ఎన్‌టీఆర్ కొంత మేర సహకారం అందించగా, వైఎస్ రాజశేఖరెడ్డి, జగన్మోహనరెడ్డిల వల్లనే ఆర్టీసీ మనుగడ సాధిస్తుందని చెప్పారు. ఆర్టీసీ కార్మికులు వచ్చే ఎన్నికలలో జగన్మోహనరెడ్డికి మద్దతు తెలపాలని పరోక్షంగా చెప్పటం పట్ల పలువురు కార్మికులు పెదవివిరిచారు.

ఆశా కార్యకర్తల ముందస్తు అరెస్టులు



పంగులూరుకు వెళ్లిన ఆశా కార్యకర్తలు, పోలీసులు

చినగంజాం, ఫిబ్రవరి 7 : ఆశా కార్యకర్తల డిమాండ్ల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్ వద్ద గురువారం జరిగే రాష్ట్ర వ్యాప్త ధర్నాకు అనుమతి లేదంటూ చినగంజాం పోలీసులు ఆశా కార్యకర్తలకు ముందస్తు నోటీసులు జారీతో పాటు అరెస్టులు చేశారు. చినగంజాం పీహెచ్‌సీ పరిధిలోని ఆశా కార్యకర్తలకు పోలీసులు బుధవారం నోటీసులు అందించి అదుపులోనికి తీసుకొని చినగంజాం పోలీసుస్టేషన్‌కు తరలించారు. స్థానిక పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న సీహెచ్‌వో ఝాన్సీరాణి భర్త కొద్ది రోజుల క్రితం గుండెపోటుతో చనిపోయారు. ఝాన్సీరాణి స్వగ్రామం అయిన జె.పంగులూరు గ్రామంలో ఝాన్సీరాణి భర్త ఆదరణ కూడిక కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆశా కార్యకర్తలు పీహెచ్‌సీకి బుధవారం మధ్యాహ్నం వచ్చారు. వచ్చిన ఆశా కార్యకర్తలు బి.జయమ్మ, సీ.హెచ్.మర్తామ్మ, సీ.హెచ్.ఆదిలక్ష్మి, పీ.శ్రీలక్ష్మి, సీ.హెచ్. అజంతా, కే.రమాదేవి, బి.శారమ్మ, సౌజన్యలను పోలీసులు స్టేషన్‌కు పిలిచి వారికి నోటీసులు అందజేశారు. జె.పంగులూరు గ్రామంలో జరిగే కార్యక్రమానికి వెళ్తున్నామని ఆశా కార్యకర్తలు పోలీసులకు తెలిపారు. ఆశా కార్యకర్తలతో పాటు పోలీసులు కూడా జె.పంగులూరు వెళ్లారు. జె.పంగులూరులో కార్యక్రమం అయిన తర్వాత వారు సాయంత్రం 5.30 గంటల సమయంలో చినగంజాం వచ్చారు. అనంతరం ఆశా కార్యకర్తలను పోలీసుస్టేషన్లో నిర్బంధించారు

నేడు చలో విజయవాడ

చినగంజాం, ఫిబ్రవరి 7 : కనీస వేతనం చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ని ఆశాలుగా మార్పు చేయాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్, మెటర్నటీ సెలవులు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైద్యాధికారి ఎస్.విజయభాస్కరరావుకి బుధవారం వినతిపత్రం అందజేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశా కార్యకర్తలకు పనిభారాన్ని పెంచింది కానీ కనీస వేతనాలు పెంచలేదని పలువురు ఆశా కార్యకర్తలు తెలిపారు. పది వేల రూపాయిలు వేతనం ఇస్తున్నామనే పేరుతో 24 గంటలు చాకిరీ చేస్తున్నారని తెలిపారు. ఇతర సిబ్బంది చేయాల్సిన అనేక రకాల పనులు బెదిరించి, వేధించి మాతో చేస్తున్నారని వాపోయారు. పని భారాన్ని తగ్గించాలని, మొబైల్ వర్క్స్‌పై శిక్షణ ఇవ్వాలని, పీహెచ్‌సీకి పిలిపించిన ప్రతి సందర్భంలోనూ టీఏ,డీఏలు ఇవ్వాలని, రిటైర్మెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్‌లతో గురువారం విజయవాడ ధర్నాచౌక్ వద్ద జరిగే ధర్నాలో ఆశా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ప్రతాప్‌కుమార్ కోరారు.



వైద్యాధికారి విజయభాస్కర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

ఆశా కార్యకర్తలకు నోటీసులు

చీరాల: విజయవాడలో గురువారం జరిగే ధర్నాకు నియోజక వర్గంలోని ఆశా కార్యకర్తలకు అనుమతి లేదని, అందులో పాల్గొన కూడదని తెలుపుతూ పోలీసులు ముందస్తు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ కనీస స్వేచ్ఛ లేకుండా ప్రభుత్వం పోలీసులను ప్రయోగించటం దారుణమన్నారు.

వైద్యసేవలు అందించడంలో ప్రభుత్వం విఫలం

ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ విమర్శ


సంతమాగులూరు, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో పేదలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యసేవలను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు మక్కెన అంజయ్య ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటుండగా బుధవారం రవికుమార్ అంజయ్య ఇంటికి వెళ్ళి పరామర్శించారు.మిన్నెకల్లు గ్రామానికి చెందిన తన్నీరు కొండమ్మ బుధవారం మృతి చెందగా కొండమ్మకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా ఉందని అందుకు నిదర్శనమే ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్ పెట్టడం అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన చంద్రన్న బీమా పథకాన్ని జగన్‌రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టిపాటి చౌదరిబాబుపాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ

బల్లికురవ : ఇటీవల అనారోగ్యం బారిన పడిన పలువురు టీడీపీ కార్యకర్తల కుటుంబాలను బుధవారం అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. బల్లికురవ గ్రామానికి చెందిన మాజీ మండల పార్టీ అధ్యక్షులు గొట్టిపాటి లక్ష్మయ్య భార్య అనురాధ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి మృతురాలికి నివాళులు అర్పించారు. అలానే కంభంపాటి అంజమ్మ కాలికి శస్త్ర చికిత్స చేయించుకోగా ఆమెను పరామర్శించారు. అలానే టీడీపీ ఎస్సీసెల్ నేత కత్తి బుల్లి అంజియ్య గుండె సంబంధ వ్యాధితో బాధ పడుతుండగా అయనను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ కార్యక్రమాలలో గొట్టిపాటి వెంట మండల పార్టీ అధ్యక్షులు కొండేటి ఇజ్రాయల్, నేతలు గొట్టిపాటి శంకర్, పావులూరి ఏడుకొండలు, దూళిపాళ్ల హనుమంతరావు, దద్దాల అంజయ్య పాల్గొన్నారు.



మక్కెనవారిపాలెంలో అంజయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్



చైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న తలపనేని సుధాకర్

పీఏసీఎస్ చైర్‌పర్సన్ బాధ్యతల స్వీకరణ

పంగులూరు, ఫిబ్రవరి 7: జనకవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్ పంగులూరుకు చెందిన తలపనేని సుధాకర్ బాధ్యతలను స్వీకరించారు. బుధవారం రాత్రి పంగులూరు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నూతన పాలక వర్గ చైర్‌పర్సన్‌గా నియమితులైన తలపనేని సుధాకర్‌కు సీఈవో నాగబోయిన లక్ష్మీదేవి బాధ్యతలను అప్పగించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బొల్లా పోలయ్య, కట్టా నాగేశ్వరరావు, స్వయంపు హనుమంతరావు, రావూరి శ్రీనివాసరావు, నాగబోయిన తిరుపతయ్య, తలపనేని శ్రీనివాసరావు, బాచిన ఆంజనేయులు, గుడిపూడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

69 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుకొన్న రేషన్ బియ్యంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

మేదరమెట్ల , ఫిబ్రవరి 7: జాతీయ రహదారిలో తిమ్మన్నపాలెం వద్ద రేషన్‌బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. బుధవారం వేకువజామున మేదరమెట్ల వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న రేషన్‌బియ్యం లారీనీ ఎన్‌ఫోర్స్ మెంట్ డీటీ వాసుదేవరావు సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. లారీలో ఒక్కోటి 50 కేజీల బరువు ఉన్న 69 బస్తాలను పట్టుకుని కేసు నమోదు చేశారు. పట్టుకున్న బియ్యాన్ని రేషన్ డీలర్‌కు అప్పగించడంతో పాటు లారీని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు మేదరమెట్ల ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ తెలిపారు.

వాడరేవు తీరంలో అనుమానాస్పద మృతదేహం



ఒడ్డుకు వచ్చిన మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వాడరేవు(చీరాలటౌన్), ఫిబ్రవరి 7 : చీరాల మండల పరిధిలోని వాడరేవు సముద్రతీరంలో బుధవారం సుమారు 60 ఏళ్ల వృద్ధుడి మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. సమాచారం అందుకున్న రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యన్నారాయణ, ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు బ్లూ రంగు చొక్కా, నలుపురంగు ప్యాంటు, షూ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

చినగంజాం తహసీల్దార్‌గా ఫణీంద్రబాబు



తహసీల్దార్ ఫణీంద్రబాబుని సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

చినగంజాం, ఫిబ్రవరి 7 : మండల తహసీల్దార్‌గా జీవీఎ్ ఎ.ఫణీంద్రబాబు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా తాడికొండ మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఆయన చినగంజాం వచ్చారు. చినగంజాం తహసీల్దార్‌గా పాలపర్తి పార్వతి విధులు నిర్వహిస్తూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఫణీంద్రబాబును డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ దాసరి శ్రీకాంత్, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు.

పర్చూరు తహసీల్దార్‌గా సుబ్బయ్య

పర్చూరు, ఫిబ్రవరి 7: పర్చూరు మండల తహసీల్దార్‌గా సీహెచ్.సుబ్బయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లాలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన సంధ్యశ్రీ మార్టూరుకు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 7: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డివిజన్ విద్యుత్ ఈఈ జాన్‌థామస్ అన్నారు. బుధవారం పట్టణ పరిధిలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొత్తం 1,600 సర్వీలను తనిఖీలు చేసి అదనపు లోడ్ వాడుతున్న 132 సర్వీసులకు రూ.3.80 లక్షలు అపరాధ రుసుము విధించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డీఈ శ్రీనివాసరావు, చీరాల డీఈ టి.శ్రీనివాసరావు, వేటపాలెం డీఈ జె.శ్రీనివాసులు, పర్చూరు డీఈ రమేష్, 9 మండలాల ఏఈలు పాల్గొన్నారు.

చీరాలకు గర్వకారణం చిదంబరశాస్త్రి సేవలు

అన్నదానం చిదంబరశాస్త్రి సేవలు చీరాలకే గర్వకారణంగా నిలిచాయని పలువురు భక్తులు పేర్కొన్నారు. అయోధ్యలో చిదంబరశాస్త్రి బాలరాముడికి యంత్రం సమర్పించిన నేపథ్యంలో బుధవారం ఆయనకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు శ్రీరాముని భక్తులు పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేసే పార్టీలకు మద్దతు




బల్లికురవ ఎంఈవో కార్యాలయం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

బల్లికురవ. ఫిబ్రవరి 7 : ఉద్యోగులందరికి ఓల్డ్ పెన్షన్ అమలు జరిపే పార్టీలకు మద్దతు తెలియజేస్తామని ఉద్యోగులు తెలిపారు. బుధవారం బల్లికురవ ఎంఈవో కార్యాలయం వద్ద ఓపీఎస్ అమలు చేయాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉన్న ఉద్యోగులకు అమలు చేసే పెన్షన్ విధానాన్ని అమలు చేసే పార్టీలకు సార్వత్రిక ఎన్నికలలో తాము మద్దతు తెలియజేస్తామని వారు ఈసందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రమేష్, యూటీఎఫ్ నేతలు అచ్యుత్ మోహన్, సంపతి శ్రీనివాసరావు, కొమ్మూరి ఏడుకొండలు, అనంతలక్ష్మి, నటరాజ, బొప్పుడి శ్రీనివాసరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

10న అద్దంకికి మఠాధిపతులు రాక

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 7: ఈశ్వరిదేవి మఠం ఆ స్థాన మఠాధిపతులు వీరశివ కుమార స్వాములు ఈ నెల 10వ తేదీన అద్దంకిలోని కాకానిపాలెంలో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి రానున్నారని విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో కుమార స్వామి పర్యటనకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, కలశ స్థాపన, అభిషేకం, 108 మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన, శాంతి హోమం వంటి పూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. పూజలలో పాల్గొనే వారు 9వ తేదీలోపు 9063239129 నెంబరుకు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సహకారం



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బాపట్ల జిల్లా ఎంవీఐవో ప్రసన్నకుమారి, వైద్యాధికారులు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 7: రోడ్డు ప్రమాద బాధితులకు తగు సమయంలో సరైన వైద్యం అందించి వారికి సహాయ పడదామని బాపట్ల జిల్లా మోటర్ వెహికిల్ తనిఖీ అధికారిణి ఎన్. ప్రసన్న కుమారి అన్నారు. బుధవారం అద్దంకి వచ్చిన ఆమె 35వ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా బాపట్ల జిల్లా రవాణా శాఖ అధ్వర్యంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు, సిబ్బందితో కలిసి గుడ్ సమారిటన్(మంచిసహాయకుడు)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సంబంధిత పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శరత్‌చంద్ర కుమార్, పురిటి పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వెంకట కిరణ్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రదీప్‌కుమార్, రేడియోగ్రాఫర్ తాళ్ళూరి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

10 న అద్దంకి నియోజకవర్గ రేషన్ డీలర్ల సమావేశం

అద్దంకి, ఫిబ్రవరి7: అద్దంకి నియోజకవర్గ రేషన్ డీలర్ల సమావేశం ఈ నెల 10 వ తేదీ సాయంత్రం 3 గంటలకు అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్డు చిన్ని శాంతయ్య భవనంలో జరుగుతుందని రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పిన్నింటి గోపికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు మాధవరావు హాజరవుతారని తెలిపారు. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తామన్నారు.